జిల్లా కేంద్ర ఆసుపత్రి సేవలు భేష్



కేసీఆర్ కిట్‌ను పరిశీలిస్తున్న సుజాతారావు, కలెక్టర్ మాణిక్కరాజ్

- కేంద్ర ప్రభుత్వ సలహాదారు, రిటైర్డ్ ఐఏఎస్ సుజాతారావు
- గర్భిణులకు అందించే సేవలపై ఆరా
- కేసీఆర్ కిట్ అమలుపై సంతృప్తి

4 లో

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి

20

శనివారం 12 ఆగస్టు 2017



నీటితో కళకళలాడుతున్న నల్లవాగు ప్రాజెక్టు

'నల్లవాగు'కు

50 ఏళ్లు

అర శతాబ్దం గడిచినా చెక్కు చెదరని ప్రాజెక్టు

1964లో పనులు ప్రారంభం • 1967లో అందుబాటులోకి...

14 గ్రామాలకు, 5వేల ఎకరాలకు సాగునీరందిస్తున్న వరదాయిని

☛ సెంటర్‌స్ప్రెడ్‌లో

మొరం మట్టితో నిర్మించిన జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు 50 ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఠీవీగా నిలిచింది. సుమారు 14 గ్రామాల్లోని 5వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నది. కల్హేర్ మండల ప్రజలకు కల్పతరువుగా మారింది. 1964లో ప్రాజెక్టు పనులు ప్రారంభమవగా, 1967 ఆగస్టు 12నాటికి పూర్తయ్యాయి. నేటితో నల్లవాగు ప్రాజెక్టు అర శతాబ్దం పూర్తి చేసుకుంది.

20

ప్రయోగాలు... ప్రతిభకు తార్కాణాలు

సైన్స్ కేంద్రం ప్రారంభోత్సవంలో కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్



డిజిటల్ విధానంలో పాఠాలను బోధిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)



6 టన్నుల

నల్లబెల్లం పట్టివేత

- లారీ సీజ్ : ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గాయత్రి వెల్లడి

← అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం లారీ ఇదే

3 లో

ఇంటర్మీడియట్‌లోనూ

డిజిటల్ బోధన

- ప్రయోగాత్మకంగా సంగారెడ్డి బాలికల కళాశాల ఎంపిక
- త్వరలో జిల్లాలోని అన్ని కాలేజీల్లో ఏర్పాటు
- కార్పొరేట్‌కు దీటుగా తరగతుల నిర్వహణ
- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య
- కళాశాలలకు క్రీడా సామగ్రి అందజేత
- మధ్యాహ్నభోజనం అమలుకు సర్కారు యోచన

5

అధిక విద్యుత్ బిల్లులపై

దిడిగి గ్రామస్థుల

ఆందోళన

- ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ. 1లక్ష బిల్లు
- అధికారి హామీతో శాంతించిన గ్రామస్థులు

మెయిన్‌లో..

దిడిగి గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజశేఖర్ →



గంజాయి తోటపై ఎక్సైజ్ దాడి

- 5వేల మొక్కలు ధ్వంసం
- విలువ రూ.65 లక్షల పైమాటే
- పరారీలో నిందితులు

3 లో

ఈ ఇంటర్వ్యూ...



భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి

• వెంకటేశ్వర్‌రావు,
మెదక్ జిల్లా భూగర్భజల వనరుల అధికారి

మెదక్: మెదక్ జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని జిల్లా భూగర్భ జల వనరుల అధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. పలు విషయాలపై ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు.

జిల్లాలో భూగర్భజలాలు పరిస్థితి ఏవిధంగా ఉంది ?

చాలా వేగంగా భూగర్భజల మట్టాలు పడిపోతున్నాయి. గతనెలతో పోలిస్తే 50 సెంటీమీటర్ల వరకు జలాలు భూగర్భంలోకి వెళ్లిపోయాయి. జిల్లాలో రైతులు ప్రధానంగా వరిపంట వేయడం ఇందుకు ఓ కారణం. ఈ పంటకు నీరు అధికమొత్తంలో పారించాలి. నీటి వినియోగం ఎక్కువైతే సాధారణంగా భూగర్భజలాలు తగ్గిపోతాయి. మెదక్ జిల్లాలో వ్యవసాయసాగు మూడొంతులు బోరుబావులపైనే ఆధారపడడం వల్లే ఈ దుస్థితి.

ఈ పరిస్థితుల్లో రైతులు ఏ పంటలు సాగు చేయాలి ?

వరికి ప్రత్యామ్నాయంగా చాలా పంటలు వేసుకోవచ్చు. ఆరుతడి పంటలకు నీటి వినియోగం చాలా తక్కువ అవసరముంటుంది. కాబట్టి కూరగాయల సాగుపై రైతులు దృష్టి కేంద్రీకరించాలి.

ప్రభుత్వం వ్యవసాయానికి నిరంతర విద్యుత్‌ను అందిస్తోంది. దీంతో నీటి ఇబ్బందులు తగ్గవా ?

సమస్య అంతా ఇక్కడే ఉంది. రైతులు అనేక చోట్ల ఆటోమెటిక్ స్టాటర్లు వ్యవసాయబోరుబావుల వద్ద ఏర్పాటు చేసుకోవడంతో నిరంతరంగా బోరు నుంచి నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. తద్వారా నీటిమట్టాలు తగ్గిపోతున్నాయి. అవసరానికి మించి నీటిని వినియోగించడం వల్ల భూగర్భజలాలు తగ్గుతున్నాయి.

బోరుబావుల తవ్వకాలను నిషేధిస్తున్నారా ?

ఇప్పటికే సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో బోరుబావుల తవ్వకాలపై నిషేధం అమలులో ఉంది. వాల్టా చట్టం ప్రకారం తప్పనిసరి పరిస్థితుల్లో బోరు వేయడానికి భూగర్భజలాల శాఖ ద్వారా కూడా అనుమతి పొందాల్సి ఉంటుంది. మెదక్ జిల్లాలో కూడా బోరుబావులను నిషేధించాల్సిందిగా కలెక్టర్‌కు విన్నవించాం.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను మీ శాఖ ఆధ్వర్యంలో ఏవిధంగా వినియోగిస్తున్నారు ?

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో జిల్లా వ్యాప్తంగా ఉచితంగా దళిత, గిరిజన రైతులకు బోరుబావులు వేస్తున్నాం. అయితే దళిత గిరిజనులు ఈ పథకాన్ని ఎక్కువగా వినియోగించుకోవడం లేదు. అయినప్పటికీ ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది రైతులను చైతన్యం చేసి బోరు బావులు వేయిస్తున్నారు.

సంగారెడ్డి మండలం పోతిరెడ్డి పల్లి చౌరస్తాలోని ఓ గార్డెన్‌లో యోగాలో శిక్షణ ఇస్తున్న యోగా గురువు శివరాంసింగ్ (కుడి నుంచి రెండో వ్యక్తి) (ఫైల్)



ఆదర్శం

యోగా గురువు సేవలో మెరుగు

• మిలటరీ, రెవెన్యూశాఖలో నిజాయితీగా విధుల నిర్వహణ
• జిల్లాలో యోగా ఉచిత శిక్షణ శిబిరాల ఏర్పాటు
• పతంజలి ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు
• మూడు వేల మందికి పైగా శిక్షణ
• ఆదర్శంగా నిలుస్తోన్న శివరాం సింగ్

ఆయన యోగా గురువు. ఉచితంగా యోగా విద్యను అందిస్తున్నారు. ఈయన ఇదొక్కటే కాదు.. సమాజానికి అవసరమయ్యే పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రైతులను సేంద్రియ సాగు విషయంలో చైతన్యపరుస్తున్నారు. గ్రామస్థులంతా పరిసరాల పరిశుభ్రత పాటించేలా చేశారు. ఇక మద్యపానం, ధూమపానం వంటి వాటికి ఊరంతా దూరంగా ఉండేలా చేశారు. యోగా ట్రస్ట్‌కు తన నాలుగెకరాల పొలాన్ని దానంగా ఇచ్చాడు. ఇలాంటి ఉన్నత లక్షణాలు కలిగిన శివరాం సింగ్‌పై ప్రత్యేక కథనం.

సంగారెడ్డి రూరల్ : శివరాంసింగ్‌ది ఉమ్మడి జిల్లా పెద్దశంకరంపేట కొల్లపల్లి గ్రామం. పీయూసీ పూర్తి చేసిననంతరం 20 ఏళ్ల ప్రాయంలో 1969లో ఆర్మీలో చేరారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జవాన్‌గా చేరి దేశానికి సేవలు చేశారు. మిలటరీలో 1973 వరకు విధులు నిర్వహించారు. తిరిగి సొంత గ్రామానికి చేరుకున్నారు. 1974లో ఉమ్మడి మెదక్ జిల్లా నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 1977 వరకు నర్సాపూర్, జోగిపేట, నారాయణ్‌ఖేడ్ ప్రాంతాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, 1996లో డిప్యూటీ తహసీల్దార్‌గా సేవలందించారు. 1981లో కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సమర్థంగా విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. 2006లో పదవీవిరమణ పొందారు.

హరిద్వార్‌లో ప్రత్యేక శిక్షణ

ఉద్యోగం చేసే సమయంలోనే 2005లో హరిద్వార్‌లో యోగా గురువు రాందేవ్‌బాబా వద్ద యోగాసనాల్లో 11 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పొందారు. శివరాంసింగ్‌లో యోగాపై ఉన్న ఆసక్తి, పట్టుదలను చూసిన రాందేవ్‌బాబా ఉమ్మడి మెదక్ జిల్లాలో పతంజలి యోగా పీఠ్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అప్పటి నుంచి తన నివాసంలోనే ఉదయం 6 నుంచి 8 వరకు, సాయంత్రం 5 నుంచి 7 వరకు ఉచిత యోగా శిక్షణ అందించారు. పదవీ విరమణ పొందిన తర్వాత పూర్తి స్థాయి సమయాన్ని కేటాయించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటించి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా యోగా విద్యాను అందిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 2600 మందికి పైగా శిక్షణ నందించారు. వీరిలో యోగాపై ఆసక్తి గలవారిని ఎంపిక చేసి యోగా ప్రశిక్షక్‌లుగా తీర్చిదిద్దారు. శివరాంసింగ్ సేవలను గుర్తించిన యోగా గురువు రాందేవ్‌బాబా 2015లో పతంజలి యోగా పీఠానికి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

ట్రస్ట్‌కు 4 ఎకరాల స్థలం

శివరాం సింగ్ తన స్వంత గ్రామం కొల్లపల్లిలో నాలుగెకరాల భూమిని పతంజలి యోగా ట్రస్ట్‌కు ఉచితంగా అందజేశారు. తన గ్రామంలో యోగా తరగతులు నిర్వహిస్తూనే మద్యపానం, ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగించి ప్రజలను చైతన్యం చేస్తున్నారు. శివరాం సింగ్ మద్యం తాగడం వల్ల మనిషికి ఎంత నష్టం కలిగిస్తుందనే విషయాలను నిత్యం వివరిస్తుండడంతో ఇప్పటికీ ఈ గ్రామంలో మద్యాన్ని తాగడం కానీ విక్రయించడం కానీ చేయరని గ్రామస్థులు తెలిపారు. అదేవిధంగా పరిసరాల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ అందరినీ చైతన్యపరిచారు. ఊరిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన

పంటలకు సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే కలిగే లాభాలపై రైతులకు అవగాహహన కల్పించారు. శివరాం సింగ్. సహజసిద్ధమైన సేంద్రియ ఎరువులను వినియోగిస్తేనే పంటలకు బలం చేకూరి పౌష్టికాహారం లభిస్తుందని రైతులను చైతన్యపరిచారు. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే నిత్యావసర వస్తువులు అన్ని రసాయనాలతో తయారు చేసిన విదేశి సరుకులే కావడం వల్ల మానవులు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈయన అభిప్రాయం. సహజసిద్ధమైన వనమూలికలతో చేసిన వస్తువులను వినియోగిస్తే దుష్ప్రభావాలు ఉండవటున్నారు శివరాం సింగ్.

యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



యోగాసనాలు చేస్తూ గోపంచికం సేవిస్తే దీర్ఘకాలిక వ్యాధులు దూరం అవుతాయి. వీటిని ఆచరిస్తే క్యాన్సర్ వ్యాధి బారి నుంచి తప్పించుకోవొచ్చు. కొందరికి ఇలాంటి చికిత్సలు అందించి వ్యాధిని నయం చేశాం. యోగాసనాలతో కేవలం ఆరోగ్యమే కాదు ఓర్పు, సహనం, నిగ్రహ శక్తి పెరిగి కోపం దూరమై చెడు వ్యసనాలను వదిలేస్తారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నా. ఆరోగ్యవంతమైన జీవితానికి రోజు గంట సమయాన్ని కేటాయించి యోగా చేస్తే చాలు.

– శివరాంసింగ్, యోగా గురువు

కాలపరిమితి ముగిసిన జీవోలను సవరించాలి

• రాజయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

ఉద్యోగపర్వం



సంగారెడ్డి రూరల్ : కాలపరిమితి ముగిసిన 52 రకాల జీవోలను సవరించాలి. తెలంగాణ రాష్ట్రం వస్తే తమ బతుకులు బాగుపడతాయని భావించిన కార్మికుల బతుకుల్లో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. కొత్త పరిశ్రమలు వచ్చి నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని భావించాం. కానీ ఉన్న పరిశ్రమలను కాపాడకపోవడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడుతున్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించకుండా శ్రమదోపిడికి పాల్పడుతున్న పరిశ్రమ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. కనీస వేతనాల జీఓలను సవరించడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి భారం పడదు. అయినా ఎందుకు సవరించడం లేదో అర్థంకావడం లేదు. పరిశ్రమ యాజమాన్యాల ద్వారా ముడుతున్న ముడుపులకు తలొగ్గి యాజమాన్యాలకు తొత్తులుగా మారి కాలపరిమితి ముగిసి ఆరు సంవత్సరాలు పూర్తయినా జీఓలను సవరించడం లేదు. కార్మికుల పక్షాన సీఐటీయూ పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉంది.

శివుడిని దర్శిస్తే అందరు దేవుళ్లను దర్శించుకున్నట్లే !

• వీరభద్రయ్య, వర్గల్ స్వయంభూ శంభులింగేశ్వరాలయ అర్చకుడు

భక్తి

వర్గల్ : శివాలయాన్ని దర్శించినట్లయితే అందరి దేవుళ్లని దర్శించుకున్నట్లే . శివాలయంలో ఉండే శివలింగానికి 5 ముఖాలు ఉంటాయి. అందులో నాలుగు ముఖాలు నాలుగు దిక్కులను చూస్తుంటే ఐదో ముఖం మాత్రం ఊర్ధ్వముఖమైన ఆకాశం వైపు చూస్తుంది. శివాలయంలో ఏ దిక్కువైపునైనా కూర్చొని పూజ చేయవచ్చు. పశ్చిమాభి ముఖమైన శివాలయం అత్యంత మహిమ కలిగినది. కోరిన కోరికలను తీర్చేది పశ్చిమాభి ముఖమైన శివాలయం. శివలింగానికి ఎదురుగా ఉన్న ద్వారం పశ్చిమం వైపు ఉన్న, శివలింగం పశ్చిమం వైపు చూస్తున్న దానిని సద్యోజాతజాత శివలింగం అంటారు. అలాంటి శివలింగాన్ని దర్శించుకున్నట్లయితే ఓం సద్యోజాతజాత ముఖాయ నమః అని అనాలి. ఆలయంలో శివలింగం తూర్పు ముఖం ఉంటే దాన్ని తత్పురుష ముఖం అని అంటారు. దక్షిణం వైపు చూసే శివలింగాన్ని దక్షిణమూర్తి స్వరూపంగా చూడమన్నారు. ఆ ముఖాన్ని ఆఘోర ముఖం అంటారు. ఉత్తర వైపు చూసే శివలింగాన్ని వాసుదేవ ముఖం అంటారు. ఇక చివరి ముఖం శివలింగం ఆకాశంవైపు చూడటం. దీన్ని ఈశాన ముఖం అనికూడ అంటారు. శివలింగానికి ఉన్న నాలుగు వైపుల నాలుగు ముఖాలను దర్శించుకున్న తర్వాతే ఈశాన ముఖ దర్శనం చేసుకోవాలి.



గంజాయి తోటపై ఎక్సైజ్ పోలీసుల దాడి

• ఐదువేల మొక్కలు ధ్వంసం



గంజాయి తోటపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నాగల్‌గిద్ద: గుట్టు చప్పుడు కాకుండా రహస్యంగా సాగు చేస్తున్న గంజాయి తోటపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లి పంచాయతీ పరిధిలోని మేఘ్యానాయక్ తండాలో పలువురు గంజాయి సాగు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ మహేష్ తెలిపారు. ఎకరా భూమిలో 5 వేల మొక్కలు ఉన్నాయని ఒక్కో మొక్క మూడు ఫీట్లు ఎత్తు ఉంటుందన్నారు. దీని విలువ రూ.65 లక్షలు ఉంటుందన్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతో సాగు చేసిన వారి వివరాలు తెలుసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. నిందితులు పరారిలో ఉన్నారని కేసు నమోదు చేసినట్లు త్వరలో వారిని పట్టుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ గంగాధర్, సిబ్బంది, ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

• బైక్‌ను ఢీకొన్న న్యూలాండ్ పరిశ్రమ బస్సు

• మరో ఇద్దరికి గాయాలు



వెంకటేష్ మృతదేహం

పటాన్‌చెరు రూరల్: పాశమైలారంలో శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అస్త్రా పవర్ పరిశ్రమ వద్ద బైక్‌పై వెళ్తున్న యువకులను వెనుక నుంచి న్యూలాండ్ పరిశ్రమకు చెందిన బస్సు అతి వేగంతో వచ్చి బైక్‌ను బలంగా ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బీడీఎల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి అందించిన వివరాల ప్రకారం నారాయణఖేడ్ మండలం చాంద్‌ఖాన్ పల్లికి చెందిన వెంకటేష్ (16) ఇంద్ర కరణ్ జీటీఎన్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఇదే పరిశ్రమలో ఇస్నాపూర్‌లో నివాసముంటున్న రమేష్ కార్మికుడిగాను సాయిలు మేస్త్రీగా పని చేస్తున్నారు. ఉదయం డ్యూటీకి సమయం మించి పోవటంతో సాయిలు తన స్నేహితుడి బైక్ తీసుకుని వెంకటేష్, రమేష్‌ను దింపటానికి వెళ్తున్నాడు. అస్త్రా పవర్ పరిశ్రమ వద్దకు రాగానే న్యూలాం డ్ పరిశ్రమకు చెందిన ఏపీ 12 వీ 5134 నంబరు గల బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టటంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు కింద పడ్డారు. బైక్ వెనుక బాగంలో కూర్చున్న వెంకటేష్ మీద నుంచి బస్సు ముందు చక్రాలు వెళ్లటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి గాయాలు కావటంతో ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నట్టు బీడీఎల్ పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

సంగారెడ్డి టౌన్: హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్షను విధిస్తూ అడిషనల్ సెషన్స్ సీనియర్ సివిల్ జడ్జి శ్యాంశ్రీ శుక్రవారం తీర్పునిచ్చినట్లు పట్టణ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని శుక్రవారం మార్కెట్‌లో ఉంటున్న అబ్దుల్లాపై అదే ప్రాంతానికి చెందిన ఎండీ అహ్మద్ అనే వ్యక్తి 2014లో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడగా అప్పట్లో సీఐ శివశంకర్ నాయక్ కేసు నమోదు చేసి నిందితుడిని హాజరు పర్చినట్లు వివరించారు. ఈ కేసుకు సంబంధించి సాక్షులను విచారించిన సీనియర్ సివిల్ జడ్జి శ్యాంశ్రీ నిందితుడికి ఐదేళ్ల సాదారణ జైలు శిక్షతో పాటు రూ.2000 జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారని పేర్కొన్నారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ రెడ్డి వాదించారని పట్టణ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా: 9 మందికి తీవ్ర గాయాలు







బోల్తా పడిన ఆర్టీసీ బస్సు, గాయపడిన ప్రయాణికులు

• నిద్రమత్తులో బస్సు నడిపిన డ్రైవర్

చేగుంట: నిద్రమత్తులో ఆర్టీసీ బస్సును నడపగా అదుపుతప్పి బోల్తా పడ్డ ఘటనలో తొమ్మిది మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చేగుంట గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న సూపర్ లగ్జరీ ఎక్స్‌ప్రెస్ చేగుంట గ్రామ శివారులోని బైపాస్‌రోడ్డు వద్ద డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పి బోల్తా పడింది. ఆర్టీసీ డ్రైవర్ నిద్రమత్తులో వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం జరిగింది. నిజామాబాద్, బోధన్ ప్రాంతాలకు చెందిన బాల్‌రాజు, శ్రీహరి, ఫర్జాన, హక్కిం బేగం, శ్రీను, శ్రీవాణి, జప్పురాం, ప్రభాకర్ తోపాటు పలువురు గాయపడ్డారు. వీరిని హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

6 టన్నుల నల్లబెల్లం పట్టివేత

• లారీ స్వాధీనం: మెదక్ డివిజన్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గాయత్రి

జహీరాబాద్: అక్రమంగా గుడుంబా తయారీ కోసం వినియోగించే నల్లబెల్లం లారీలో తరలిస్తున్నారనే సమాచారంతో మూడు బృందాలుగా ఏర్పడి ముమ్మర తనిఖీలు చేసి 6వేల కిలోల నల్లబెల్లం పట్టుకున్నట్లు మెదక్ డివిజన్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గాయత్రి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన దాడిలో జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామ శివారులో బెల్లాన్ని తరలిస్తున్న లారీతో పాటు డ్రైవర్ స్వామి, గుమాస్తా విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. కర్ణాటకలోని కుంచారం నుంచి కామారెడ్డి జిల్లా బిక్నూర్ ప్రాంతానికి అక్రమంగా నల్లబెల్లంను తరలిస్తున్నారనే సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టగా ఈ మేరకు 6వేల కిలోల(6టన్నులు) నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా తొరమామిడికి చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తిని బెల్లం అమ్మకందారుడిగా గుర్తించామని, అతని వద్ద కొనుగోలు ఒప్పందం చేసుకుని బిక్నూర్‌కు చెందిన సామల భరత్‌కుమార్ పెద్ద ఎత్తున ఏపీ16 డబ్ల్యూ 0844 నంబర్ గల లారీలో బెల్లంను తరలిస్తున్న క్రమంలో పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. పట్టుబడ్డ బెల్లం విలువ రూ.3లక్షల మేర ఉంటుందన్నారు. గుడుంబా తయారీకి వినియోగించే నల్లబెల్లం అక్రమ రవాణ చేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న గాయత్రి

బాలిక అదృశ్యం

కౌడిపల్లి: బాలిక అదృశ్యమైన సంఘటన వెంకట్రావ్‌పేట్‌లో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ శ్రీనివాస్ ఇందుకు సంబంధించిన వివరా లు వెల్లడించారు. మండలంలోని వెంకట్రావ్ పేట్‌కు చెందిన బాలిక వడ్డె సాయమ్మ కూలీ పని కోసం గత నెల 31న నర్సాపూర్‌కు వెళ్లింది. తిరిగి రాలేదు. తల్లి గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఆచూకీ లభిస్తే సెల్ 9490617055కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శ్రీనివాస్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

వర్గల్: వర్గల్ మండలం గౌరారం పాములపర్తి గ్రామాల మధ్య రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నీరుడి బాలయ్య (28) అనే యువకుడికి తీవ్రగాయాలైనాయి. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నెంటూర్ గ్రామానికి చెందిన నీరుడి బాలయ్య శుక్రవారం ఉదయం మర్కూక్ మండలం యూసుఫ్‌ఖాన్‌పల్లి గ్రామంలో ఉంటున్న బంధువుల ఇంటివద్ద జరిగిన శుభకార్యానికి బైక్‌పై వెళ్లాడు. శుభకార్యం పూర్తి కాగానే బైక్‌పై తిరుగు ప్రయాణం కాగా గౌరారం పాములపర్తి శివారు మధ్యలో రాగానే బైక్ అదుపు తప్పి విద్యుత్ స్థంభానికి ఢీ కొట్టాడు. దీంతో బాలయ్య తలకు బలమైన గాయం కావడంతో తీవ్రంగా రక్తస్రావం జరిగింది. అక్కడక్కడ తీవ్రంగా గాయాలు కావడంతో 108 సహాయంతో చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

నిజాంపేట: విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన నిజాంపేట మండలం కల్వకుంట గ్రామ శివారులో శుక్రవారం ఉదయం జరిగింది. రజక్‌పల్లి గ్రామానికి చెందిన మంగమ్మ, బాబాగౌడ్‌కు చెందిన పాడి గేదెలు మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎర్తుకు నీరు నిండి ఉండడంతో కరెంటు ప్రవహించి రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు లక్ష రూపాయలు విలువ చేసే గేదెలు మృతి చెందాయని బాధితులు విలపించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వహించారని బాధితులు ఆరోపించారు.



మృతి చెందిన పాడిగేదెలు

వికటించిన ‘అల్బెండజోల్’?

• మర్రిముచ్ఛాలకు చెందిన పలువురు విద్యార్థుల అస్వస్థత • సిద్దిపేట ఎంసీహెచ్‌కు తరలింపు

చేర్యాల: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామ ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు శుక్రవారం పంపిణీచేసిన అల్బెండజోల్, డీఈసీ మాత్రలు వికటించడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. అల్బెండజోల్ మాత్రలను గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయగా, మర్రిముచ్చాలలో మాత్రం వైద్య సిబ్బంది శుక్రవారం నులిపురుగుల నివారణ మాత్రలతో పాటు బోధకాలకు సంబంధించిన డీఈసీ మాత్రలను కలిపి మధ్యాహ్నం వేశారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు రోహిత్, శరణ్య, శివ, శశాంక్, భాను, ప్రాథమిక పాఠశాలకు చెందిన నందిని, శివచరణ్, శతిక, రశ్మిత, రంజిత్, భరత్, నగేశ్, రక్షిత పాఠశాల అనంతరం ఇంటికి చేరుకున్న కాసేపటికే వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే చేర్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు ఉన్నత పరీక్షలకు సిద్దిపేట ఎంసీహెచ్‌కు తరలించమని తెలిపారు. ఎంసీహెచ్‌లో చేర్పించగా ప్రస్తుతం చిన్నారులు చికిత్స పొందుతున్నారు. కాగా, ఆల్బెండజోల్ మాత్రలకు తోడు డీఈసీ మాత్రలు వేయడంతోనే డోస్ పెరిగి వికటించిందని పలువురు అంటున్నారు. కాగా డీఎంవో సూచన మేరకే తాము డీఈసీ మాత్రలు ఇచ్చామని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

విద్యార్థులు

'ర్యాగింగ్'కు బానిసకావొద్దు

● యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి భవాని





సదస్సులో మాట్లాడుతున్న భవాని, హాజరైన విద్యార్థినీ, విద్యార్థులు

సంగారెడ్డి రూరల్: ర్యాగింగ్ భూతానికి బానిసలై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి భవాని విద్యార్థులకు సూచించారు. సంగారెడ్డిలోని మహిళా డిగ్రీ కళాశాల, గాంధీ సెంటినరీ పాఠశాలలో శుక్రవారం చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కళాశాలల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను ర్యాగింగ్‌తో ఇబ్బందులకు గురిచేస్తే శిక్షార్హులవుతారని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు, మత్తు మందులకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాక్షించారు. విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురికాకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రామారావు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, గాంధీ సెంటినరీ పాఠశాల ప్రిన్సిపాల్ రాచన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్వచ్ఛభారత్'పై వీడియో కాన్ఫరెన్స్

సంగారెడ్డి టౌన్: పురపాలికల్లో 'స్వచ్ఛభారత్' కింద నిర్వహిస్తున్న కార్యక్రమాలపై మునిసిపల్ పరిపాలనా విభాగం డైరెక్టర్ శ్రీదేవి హైదరాబాద్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, మునిసిపాలిటీలతో పాటు అందోల్-జోగిపేట నగర పంచాయతీల్లో జరుగుతున్న స్వచ్ఛభారత్‌పై ఆమె సమీక్షించారు. సంగారెడ్డిలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయడం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. సంగారెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా పురపాలికల్లోనూ మరుగుదొడ్లు నిర్మించేలా కమిషనర్లు కృషి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి మునిసిపల్ కమిషనర్ కె.కుమారస్వామి, మేనేజర్ దేవేందర్, టీపీవో లక్ష్మీనారాయణ, ఆర్ఐ వెంకట్‌రావు, ఏఈ రాజామహేశ్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ కుమారస్వామి

దళితులపై దాడులు పెరిగాయి

● సీపీఐ మాజీ ఫ్లోర్ లీడర్ గుండా మల్లేశ్

నర్సాపూర్: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు మరింత పెరిగాయని సీపీఐ మాజీ ఫ్లోర్ లీడర్, దళిత హక్కుల పోరాట సమితి జాతీయ కన్వీనర్ గుండా మల్లేశ్ ఆరోపించారు. శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో దళితులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత పాలకుల మాదిరిగానే ప్రస్తుతం కేంద్రలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, టీఆర్ఎస్ పాలనలోనూ దళితులకు ఏమాత్రం న్యాయం జరగడం లేదన్నారు. మోదీ పాలనలో ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో గో సంరక్షణ పేరిట దాడులు చేస్తున్నా పట్టించుకునేవారు లేరన్నారు. రాష్ట్రంలో కూడా టీఆర్ఎస్ పాలనలో దళితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, వారిపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మల్లేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సేవలు భేష్

● కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ సుజాతారావు ● ఎంసీహెచ్, డీఈఐసీ కేంద్రాలను సందర్శించిన కేంద్ర బృందం

● మల్లేపల్లిలోని సబ్ సెంటర్ పరిశీలన ● కేసీఆర్ కిట్ ఎలా ఉందని ఆరా ● వైద్య సేవలపై గర్భిణులు, బాలింతలతో ముచ్చట







సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌లో గర్భిణి, బాలింతతో మాట్లాడుతున్న సుజాతారావు, కొండాపూర్‌లో వైద్యసేవలపై సుజాతరావుకు వివరిస్తున్న కలెక్టర్ మాణిక్యరాజ్

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యసేవలు భేష్ అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, కేంద్ర బృందం సభ్యురాలు సుజాతారావు కితాబిచ్చారు. ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఎంసీహెచ్ భవనంలో ప్రసూతి వార్డు, ఎల్డీఆర్, ఎస్ఎన్‌సీయూ వార్డుల్లో కలియదిరిగి రోగులతో మాట్లాడారు. జిల్లా ఆస్పత్రిలో గర్భిణులకు, బాలింతలకు అందుతున్న వైద్యసేవలను అక్కడి సూపరింటెండెంట్ రాజుగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఐసీ కేంద్రాన్ని పరిశీలించి, రోజుకు ఎంతమంది పిల్లలు వస్తారు, వారికి ఏవిధమైన వైద్యసేవలు అందుతున్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధునాతన ఎంసీహెచ్ నూతన భవనం నిర్మాణం, అక్కడ జరుగుతున్న ప్రసవాలు, కేసీఆర్ కిట్ పథకంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న వైద్యుడు రహీం, ఇతర వైద్యులను సుజాతారావు అభినందించారు. అలాగే జిల్లా కేంద్ర ఆస్పత్రి సేవలను కొనియాడిన ఆమె సూపరింటెండెంట్ రాజుగౌడ్‌ను అభినందించారు. అంతకుముందు పెద్దాపూర్‌లోని మాతృ పునర్వికాస కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ జితేష్‌పటేల్, డీఎంహెచ్‌వో మోజీరాంరాథోడ్, ఎంసీహెచ్‌వో ప్రత్యేక అధికారి డాక్టర్ గాయత్రీదేవీ, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ శశాంక్ దేశ్‌పాండే, పీవోడీటీ హిరణ్మయి, ఎన్‌హెచ్‌ఎం డీపీవో జగన్నాథరెడ్డి, ఆర్ఎంవో సంగారెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరగాలి

కొండాపూర్: జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల సాధారణ ప్రసవాలు ఏలా జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ సుజాతారావు ఆరా తీశారు. శుక్రవారం ఢిల్లీ నుంచి ఆమె నేరుగా మల్లేపల్లికి వచ్చి సబ్ సెంటర్‌ను పరిశీలించారు. గ్రామ స్థాయి నుంచి ఎవరూ ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రసవాలకు పోకుండా పీహెచ్‌సీలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. అక్కడి నుంచి కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చేరుకుని గర్భిణులు, బాలింతలతో కొద్దిసేపు ముచ్చటించారు.

ఆపరేషన్ థియేటర్, మెడికల్ ల్యాబ్, ఏఎంసీని, వార్డులను పరిశీలించారు. డాక్టర్ రేష్మాఅంజూమ్, సిబ్బంది అందిస్తున్న వైద్యసేవలపై రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో నిత్యం గర్భిణుల సంఖ్య పెరగడంతో వారంలో రెండు రోజులు సాధారణ ప్రసవాలు, మరో రెండు రోజులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రేష్మాఅంజూమ్ వివరించారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ ఎలా ఉందని ఆస్పత్రికి వచ్చిన బాలింతలను సుజాతారావు అడిగి తెలుసుకున్నారు. ఈ కిట్ వల్ల ఉపయోగాలు ఉన్నాయా? లేవా? అని బాలింతల నుంచి సమాధానం రాబట్టారు. గత ఏప్రిల్ నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు 107 సాధారణ ప్రసవాలు, 62 కుటుంబ నియంత్రణ ఆఫరేషన్లు చేసినట్లు వైద్యులు తెలుపడంతో ఆమె పీహెచ్‌సీ వైద్యులను, సిబ్బందిని శెభాష్ అంటూ పొగిడారు. రోగుల నమోదు ప్రక్రియకు సంబంధించి ఏఎన్ఎంలకు ఇచ్చిన ట్యాబ్‌లను చూశారు. వాటిలో నమోదు ప్రక్రియ బాగుందని, ఇలానే కొనసాగించాలని ఆమె సూచించారు.

ఇదిలా ఉండగా.. కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించడానికి వస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ సుజాతారావు డీఎంహెచ్‌వోకు సమాచారమివ్వడంతో జిల్లా కలెక్టర్ మాణిక్యరాజ్‌కన్నన్ కొండాపూర్ పీహెచ్‌సీలో గంటనర్నపాటు సుజాతరావు కోసం వేచిచూశారు. ఆమె రాగానే జిల్లాలో వైద్యసేవలు, పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల గురించి కలెక్టర్ వివరించారు. వారి వెంట ట్రైనీ కలెక్టర్ విక్రమ్ జేడీ, జిల్లా వైద్య అధికారులు గాయత్రిదేవీ, శశాంక్ ఉన్నారు.

జహీరాబాద్ ఆస్పత్రిలో సేవలపై ఆరా

జహీరాబాద్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని శుక్రవారం కేంద్ర బృందం సందర్శించింది. అక్కడి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఇటీవల ప్రారంభమైన ఐసీయూ, ప్రసూతి గదులను పరిశీలించారు. అలాగే కేసీఆర్ కిట్ల పంపిణీ, ప్రసూతి కేసుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ బృందం వెంట జిల్లా కేసీఆర్ కిట్ ఇన్‌చార్జి గాయత్రీదేవి, ఆసుపత్రి వైద్యులు ఉన్నారు.

'ఈ-పాస్'తో రేషన్ సరుకుల పంపిణి

● వేలిముద్రలు నమోదు కానివారికి ప్రతి నెలా 20వ తేదీ తరువాత అందజేత

● 40 వేల ఈ-పాస్ లావాదేవీలు పూర్తి

● ఇకపై రోజుకు 15 వేలు జరిగేలా చర్యలు

● సిద్దిపేట డీఎఫ్‌వో వెంకటేశ్వర్లు



మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న డీఎస్‌వో

చేర్యాల: ప్రజలకు పారదర్శకంగా రేషన్ సరకులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఈ-పాస్ విధానాన్ని అమలుచేస్తోందని జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్‌వో) వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం చేర్యాల మండల కేంద్రంలోని 7, 12 నెంబర్ల రేషన్ షాపుల్లో ఈ-పాస్ విధానం ద్వారా లబ్ధిదారులకు సరుకుల పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ-పాస్ విధానం ద్వారా రేషన్ డీలర్ నిర్వహించడంతో పాటు అసలైన లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందుతాయని, తద్వారా సరుకులు పక్కదోవ పట్టడానికి ఆస్కారం ఉండదన్నారు. రేషన్ కార్డుదారుల్లో ఎవరో ఒకరు వేలిముద్ర వేసి సరుకులు తీసుకోవచ్చన్నారు. వేలిముద్ర తీసుకోవడం లేదని డీలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ నిరాకరించకూడదని, అన్ని చేతివేళ్లనూ పరిశీలించాలని, తరువాత కూడా నమోదుకాని వారి వివరాలు తెలియజేయాలన్నారు. ఈ విషయమై లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని, వృద్ధులు, ఇతరుల వేలిముద్రలు నమోదు కాకపోతే ప్రతి నెలా 20వ తేదీ తరువాత నిర్ణీత అధికారి వేలిముద్ర ఆధారంగా సరుకులు అందజేస్తామని డీఎస్‌వో వివరించారు. రేషన్ డీలర్లు సంయమనం పాటించాలని, ఇష్టారాజ్యంగా దుకాణాలు మూసివేయకూడదని, ప్రతిదీ ఆన్‌లైన్‌లో నిక్షిప్తమైన తరుణంలో ఎవరు మూసివేశారు, అందుబాటులో ఉన్నదెవరు అన్న విషయం తెలిసిపోతుందన్నారు. జిల్లాలోని 486 రేషన్ షాపులకు గోదాముల నుంచి బియ్యం తరలింపు జరిగిందని, సాంకేతిక లోపం వల్ల జాప్యం జరుగుతున్నందున ఈ నెల 25వ తేదీ వరకు సరుకుల పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఇప్పటివరకు జిల్లాలో 50 వేల ఈ-పాస్ లావాదేవీలు జరిగాయని, ఇకపై నిత్యం 15వేల చొప్పున జరిగేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వేలిముద్రలు నమోదు కానివారు యెడల నిర్లక్ష్యం వహించే డీలర్లపై చర్యలు తప్పవన్నారు. సరుకుల తూకం విషయాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద తప్పనిసరిగా చూసుకోవాలని, డీలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోబోతుందన్నారు. అనంతరం స్థానిక సివిల్ సప్లయీస్ గోదాంను సందర్శించిన వెంకటేశ్వర్లు సరుకుల నిల్వతో పాటు రికార్డులను పరిశీలించారు.

మాలలకు ప్రత్యేక కార్పొరేషన్ కావాలి

● మాలమహానాడు నేత పిల్లి సుధాకర్

సిద్దిపేట టౌన్: మాలలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని మాలమహానాడు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పిల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాల మృత వీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. 1997, ఆగస్టు 11న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాలలపై జరిగిన దాడుల్లో మృతిచెందిన శేషయ్య, నారాయణల వర్ధంతిని నిర్వహిస్తున్నామన్నారు. వర్గీకరణ పేరుతో దళితులను విడదీయడానికి కుట్ర జరుగుతోందన్నారు. ఈ నెల 23న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సుధాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కౌన్సిలర్ సాకి ఆనంద్, సత్యనారాయణ, వెన్న రాజు, లక్ష్మి, బాలపోషయ్య, యాదగిరి, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఇంటర్‌లోనూ డిజిటల్ బోధన



డిజిటల్ తరగతుల నిర్వహణకు ఎంపికైన సంగారెడ్డి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల



కళాశాలకు మంజూరైన క్రీడా సామగ్రి

- ప్రయోగాత్మకంగా సంగారెడ్డి బాలికల కళాశాల ఎంపిక
- త్వరలో అన్ని కాలేజీల్లో అమలు
- కార్పొరేట్‌కు దీటుగా తరగతులు

సంగారెడ్డి అర్బన్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలో బోధన ఉండాలని ప్రభుత్వం సంకల్పిస్తోంది. అందులో భాగంగా పాఠశాలల్లో డిజిటల్ బోధనను తెచ్చింది. ఇప్పుడు మరో మరో అడుగు ముందుకేసింది. తాజాగా ఇంటర్‌లోనూ డిజిటల్ విద్యను ప్రవేశపెట్టేందుకు నిర్ణయించింది. విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే, మరోవైపు ఆధునిక టెక్నాలజీని అనుసంధానం చేస్తోంది. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనేక చర్యలు తీసుకుంటుంది. ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఎంపిక చేసింది. ఇక్కడి పేద విద్యార్థులకు నాణ్యమైన బోధన అందితే ఉత్తీర్ణత శాతం పెరగడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశముంది. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల శాతం పెరుగుతోంది. దాంతోపాటు విద్యార్థులు కూడా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. డిజిటల్ బోధన పూర్తిస్థాయిలో అమలైతే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతాయి

డిజిటల్ తరగతులతో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యాబోధన అందనుంది. ప్రధానంగా నిపుణులతో ప్రత్యేక తరగతుల నిర్వహణ, బోధన పద్ధతులు మారడంతో విద్యార్థులకు మరింత సులువుగా పాఠ్యాంశాలు అర్థమవుతాయి. సాధారణ తరగతుల కంటే డిజిటల్ తరగతుల్లో పూర్తిస్థాయిలో ప్రయోగాత్మకంగా వివిధ అంశాలను చూపుతూ బోధిస్తారు. దీంతో వాటిపై విద్యార్థులకు మంచి అవగాహన కలుగుతుంది. దంతో పాఠ్యాంశాలు ఎక్కువ కాలం గుర్తుంచుకునే అవకాశం ఉంటుంది. ఒకసారి బోధించే కంటే ఇలాంటి విధానంలో దృశ్య శ్రవణ పద్ధతిలో విద్యాబోధన అనేక సత్ఫలితాలు ఇస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. తద్వారా ప్రైవేటు కంటే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే మరింత నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

సంగారెడ్డి బాలికల కళాశాలలో...

ఇంటర్మీడియట్‌లోనూ డిజిటల్ తరగతుల నిర్వహణకు సర్కారు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ప్రయోగాత్మకంగా సంగారెడ్డిలోని బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశపెట్టింది. ఇక్కడ పరీక్షించి, రెండు నెలల్లో జిల్లాలోని అన్ని కళాశాలల్లో పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్‌కు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోబోతుంది. జిల్లాలో పూర్తిస్థాయిలో అమలైతే పేద విద్యార్థులకు కార్పొరేటు స్థాయిలో నాణ్యమైన విద్య అందే అవకాశముంది.

క్రీడా సామగ్రి అందజేత

విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే సంకల్పంతో ఇటీవల అన్ని జూనియర్ కళాశాలలకు క్రీడా సామగ్రిని అందజేసింది. గతంలో క్రీడా సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయింది కాదు. ఈసారి ఏకంగా క్రీడా పరికరాలు పంపిణీతో విద్యార్థులందరికీ క్రీడల్లో ఆసక్తి కలిగించి, వారు ప్రతిభను వెలికితీయాలని సర్కారు యోచిస్తున్నట్టు చెప్పొచ్చు.

త్వరలో మధ్యాహ్నభోజనం

విద్యా వ్యవస్థను బలోపేతానికి సర్కారు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. పాఠశాలల మాదిరిగానే జూనియర్ కళాశాలల విద్యార్థులకూ ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేస్తున్నది. అంతేకాకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకం అమలుచేసేందుకు సర్కారు యోచిస్తోంది. త్వరలోనే ఆదేశాలు జారీ అయ్యే అవకాశముందని అధికార యంత్రాంగం పేర్కొంటున్నది.

త్వరలోనే అన్ని కళాశాలల్లో...



త్వరలో అన్ని కళశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణకు సర్కారు కసరత్తు చేస్తుంది. ప్రయోగాత్మకంగా సంగారెడ్డి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఎంపిక చేశాం. ఇందులో విజయవంతమైన తరువాత జిల్లాలోని 20 కళాశాలల్లో ఏర్పాటు చేయనున్నాం. ఇది పేద విద్యార్థులకు వరంగా మారనున్నది.

-కిషన్‌చవాన్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

జోరుగా వ్యర్థాల పారబోత దందా

- తీరుమార్చుకోని పరిశ్రమల యాజమాన్యం
- ముఠాల ద్వారా వ్యర్థాల తరలింపు
- గడ్డపోతారంలో రెండుచోట్ల ఇదే తంతు
- ఎంఎస్ హెచ్చరికలు బేఖాతరు

జిన్నారం: పరిశ్రమల తీరు మారలేదు.. యథేచ్ఛగా ప్రమాదకర రసాయన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. నాలాలు, పొలాలు, బహిరంగ ప్రదేశాలు కలుషితమవుతున్నాయి. స్వయంగా పీసీబీ అధికారి పారిశ్రామికవాడలో పర్యటించి, డంప్‌లపై హెచ్చరించినా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. గడ్డపోతారం పారిశ్రామిక ప్రాంతంలో మూడు రోజుల వ్యవధిలోనే రెండు చోట్ల రసాయనాలను పారబోయడం పరిశ్రమల ఇష్టారాజ్య వైఖరికి నిదర్శనం.

దందాగా వ్యర్థాల పారబోత

పారిశ్రామిక ప్రాంతాల్లో రసాయన పరిశ్రమల వ్యర్థాలను గుట్టుగా పారబోసేందుకు కొన్ని ముఠాలు పనిచేస్తున్నాయి. వ్యర్థాలను రాత్రి వేళల్లో పారిశ్రామికవాడ సమీపంలోని బహిరంగ ప్రాంతాలు, చెరువు, కుంటల్లో పారబోయడమే వీరి పని. పారిశ్రామిక ప్రాంతాల్లో కొందరు నెంబర్ లేని వాహనాలు, మరి కొందరు ఒకే నెంబర్‌తో రెండు వాహనాలను ఈ దందా కోసం వినియోగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక కొన్ని పరిశ్రమల్లో అనుమతి లేని ఉత్పత్తులను అధికంగా చేస్తున్నాయి. ఈ ప్రక్రియలో వెలువడే ప్రమాదకర వ్యర్థ రసాయనాలను శుద్ధి కేంద్రాల్లో అనుమతించారు. దాంతో వాటిని గుట్టుగా పారబోస్తున్నారు. కాగా ఈ రసాయనాల శుద్ధికి ఒక్కో ట్యాంకర్‌కు రూ.50వేల నుంచి 2లక్షల వరకు ఖర్చు అవుతున్నట్టు ట్రీట్‌మెంట్ ప్లాంట్ సిబ్బంది పేర్కొంటున్నారు. ఆయా పరిశ్రమల్లో లెక్కకు మించి విడుదలయ్యే వ్యర్థాలను శుద్ధి చేయాలంటే లక్షలాది రూపాయలను ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఆ డబ్బును మిగుల్చుకోవాలన్న పరిశ్రమల ఆరాటాన్ని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. కేవలం రూ.20 వేల నుంచి 40 వేలు తీసుకుని వ్యర్థాలను గుట్టుగా తరలించి బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారనే ఆరోపణలున్నాయి. పరిశ్రమల నుంచి సాయంత్రం 6 నుంచి, ఉదయం 6 గంటల సమయంలో ట్యాంకర్ల ప్రవేశం నిషేధం. అయినా.. ఎలాంటి నిఘా లేకపోవడంతో రోజు రాత్రి పూటే ఈ వ్యవహారం సాగుతోంది. ఈనెల 9, 11న గడ్డపోతారం పరిధిలోని రెండు ప్రాంతాల్లో రసాయనాల పారవేత కలకలం రేపింది. ఓ పరిశ్రమ నుంచి టాయిలెట్ నీటిలో కలిపి రసాయనాలను బహిరంగ ప్రాంతాల్లో పారబోయడం వివాదస్పదం అయింది. సదరు పరిశ్రమను అధికారులు గుర్తించి నమూనాలను సేకరించారు.

ఎంఎస్ ఆదేశాలు బేఖాతరు

ఉమ్మడి మండలంలోని మూడు పారిశ్రామిక వాడల్లో వరుసగా పర్యటించి, పరిశ్రమల తీరుపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి (ఎంఎస్) ఆదేశాలను, హెచ్చరికలను పరిశ్రమలు బేఖాతరు చేస్తున్నాయి. మూడునెలల క్రితం బొల్లారం, గడ్డపోతారం, బొంతపల్లిలో ఎంఎస్ పర్యటించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశాలు నిర్వహించారు. ఇందులో పరిశ్రమల సమస్యలను ప్రభుత్వపరంగా తీరుస్తామని, కాలుష్యాన్ని మాత్రం కట్టడి చేయాల్సిందేనని ఎంఎస్ స్పష్టంచేశారు. కొన్ని రోజులు బుద్ధిగా ఉన్నా.. ఇటీవల మళ్లీ పాత పద్ధతికి తెరతీశారు. రెండు నెలల క్రితమే నాలుగు పరిశ్రమలకు మూసివేత, జరిమానా ఉత్తర్వులిచ్చినా రసాయనాల పారబోత మాత్రం ఆగడం లేదు. వారం వ్యవధిలోనే రెండు ఘటనలు చోటుచేసుకోగా.. పీసీబీ జోనల్ అధికారులు సీరియ స్‌గా పరిశ్రమల తీరుపై చర్యలకోసం సిఫారసు చేసినట్లు తెలిసింది.



ఓ పరిశ్రమ ప్రహరీ వద్ద వ్యర్థ రసాయనాలు



(ఫైల్ ఫొటో)

గజ్వేల్‌కూ డ్రగ్స్!

- గజ్వేల్‌లోనూ డ్రగ్స్ విక్రయాలు
- వ్యసనంగా మార్చుకున్న పలువురు విద్యార్థులు
- హైదరాబాద్ నుంచి తరలిస్తున్న ముఠాలు
- శివారు ప్రాంతాలే అడ్డాగా సేవిస్తున్న యువకులు
- ఇప్పటికే పలువురిపై నిఘా పెట్టిన పోలీసులు

గజ్వేల్‌అర్బన్: గజ్వేల్‌లో మనోళ్లు క్షేమమేనా? అని తల్లిదండ్రులు ఆలోచించాల్సిన సమయం వచ్చేసింది. యూత్, ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులు, డ్రగ్స్‌కు అలవాటు పడినట్టు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి పలువురు డ్రగ్స్ గజ్వేల్‌కు సరఫరా చేస్తూ విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. యువకులు, కళాశాల విద్యార్థులు శివారు ప్రాంతాలను అడ్డాగా చేసుకొని డ్రగ్స్ తీసుకుంటున్నారు. అంతేకాకుండా పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను అడ్డాలుగా మారాయని, ఈ తతంగానికి యజమానులూ సహకరిస్తున్నట్టు సమాచారం. ఈ దందాపై ఇప్పటికే పోలీసులు, అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పలువురిపై నిఘాను ఏర్పాటు చేసినట్లు సమాచారం.

గజ్వేల్ పట్టణంతో పాటు మండలంలో ఇంజనీరింగ్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. రోజు రోజుకూ పట్టణం విస్తరిస్తుండడంతో పాటు నయా కల్చర్‌తో పాటూ డ్రగ్స్‌కల్చర్‌కు కూడా అలవాటుపడుతున్నారు. ఆధునిక పోకడల నడుమ యువత పెడదోవ పట్టడంతో పాటు మద్యం, ధూమపానానికి అలవాటు పడ్డారు. ఈ క్రమంలోనే డ్రగ్స్‌కల్చర్ వైపు ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులతో పాటు పలువురు యువకులు అలవాటైనట్లు తెలుస్తోంది. ఒకరి నుంచి మరొకరు డ్రగ్స్ ఊబిలో చిక్కుకుంటున్నారు.

హైదరాబాద్ నుంచి దిగుమతి

హైద్రాబాద్ నుంచి పలువురు యువకులు డ్రగ్స్ తీసుకువచ్చి వ్యాపారం చేస్తున్నారు. సమాజంలో కొంత పలుకుబడి ఉన్న తల్లిదండ్రుల సుపుత్రులే ఈ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు సమాచారం. యూత్‌ను టార్గెట్‌గా చేసుకుని ఈ ముఠా సరుకును విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. ఫోన్లలో ఇతరులతో మాట్లాడేటపుడు ఎవరికీ అనుమానం రాకుండా కోడ్‌భాషను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తుంది.

శివారు ప్రాంతాలే అడ్డా

పట్టణంలోని శివారు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని యువత ఈ డ్రగ్స్‌ను సేవిస్తున్నట్లు సమాచారం. హుక్కా మిషన్లను కొనుగోలు చేసుకుని తెచ్చుకున్న యువత హుక్కాలో డ్రగ్స్‌ను కలుపుకుని సేవిస్తున్నారు. ముఖ్యంగా రాజిరెడ్డిపల్లిరోడ్, జూనియర్ కళాశాల మైదానం, పాండవుల చెరువులాంటి ప్రాంతాల్లో ఈ తతంగాన్ని పూర్తి చేస్తున్నట్లు తెలిసింది. మత్తుకు బానిసైన పట్టణానికి చెందిన ఓ యువకుడు ఇప్పటికే రెండు సార్లు ఆస్పత్రిపాలయ్యాడు. మరో వంద మంది యువకులు మత్తులో తూగుతున్నట్లు సమాచారం. అనుమానితులపై ఇప్పటికే పోలీసులు ఓ కన్నేసినట్లు వినికిడి.



(ఫైల్ ఫొటో)

సినిమాలు

పటాన్‌చెరు
ఎస్ఎస్‌వీ — జయ జానకి నాయక
రుక్మిణి — లై

రామచంద్రాపురం
సంగీత — జయ జానకి నాయక
జ్యోతి — ఫిదా

సదాశివపేట
జ్యోతి — ఫిదా
మహేశ్వరి — నేనే రాజు నేనే మంత్రి

బొల్లారం
జ్యోతి — జయ జానకి నాయక

సంగారెడ్డి
నటరాజ్ — జయ జానకి నాయక
రుక్మిణి — ఫిదా
సితార — లై

జోగిపేట
శ్రీవెంకటేశ్వర — జయ జానకి నాయక

కాలుష్యపీడిత గ్రామాలకు 'భగీరథ' ఒక వరం

● తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ● పథకం కింద ఆరు గ్రామాల్లో పనులకు శంకుస్థాపన :ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకర్గంలో కాలుష్యపీడిత గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం మిషన్‌భగీరథ ద్వారా లభిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట, ఐలాపూర్, ఐలాపూర్ తండా, సుల్తాన్‌పూర్, గండిగూడ, పటేల్‌గూడ గ్రామాల్లో సుమారు 3.72కోట్లతో నీటి ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పటాన్‌చెరు మండలాన్ని కాలుష్య పీడిత ప్రాంతంగా చిన్నచూపు చూసేవారన్నారు. అదే నేడు హైదరాబాద్ మహానగరంలో ఒక భాగమైందన్నారు. గతంలో కాలుష్యపీడిత గ్రామాల్లో గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోయారని గుర్తు చేశారు. కాలుష్యపీడిత గ్రామాలకు మంజీరానీరు కావాలని న్యాయస్థానాల్లో పోరాటాలు చేసిన రోజులు ఉన్నాయన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మిషన్‌భగీరథ కాలుష్యపీడిత గ్రామాలకు వరదాయనిగా మారిందన్నారు. నియోజకవర్గంలోని మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించే కార్యక్రమం సమీప భవిష్యతులో సాకారం కాబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, ఎంపీపీ శ్రీశైలంయాదవ్, సర్పంచ్‌లు దొంతిప్రమీల, విసలావత్‌రవి, కుర్మనర్సమ్మ, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలదే కీలకపాత్ర

స్త్రీ, శిశు సంక్షేమంలో అంగన్‌వాడీలదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని బ్లాక్‌కార్యాలయం ఆవరణలో 45లక్షలతో నిర్మించిన సీడీపీవో భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలమైన భవనంలో గడిపిన సీడీపీఓ ప్రాజెక్టు కార్యాలయం సిబ్బంది ఇబ్బందులు గమనించి పక్కాభవనాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశామన్నారు. గ్రామాల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీలపై ఉందన్నారు. అంగన్‌వాడీలు సైతం చిత్తశుద్ధితో సేవలు చేసి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీశైలం యాదవ్, జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుష్పనగేష్‌యాదవ్, ఆత్మ కమిటీ చైర్మన్ గడీలకుమార్‌గౌడ్, వార్డు జీహెచ్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


గండిగూడలో నీటిట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రసాయన వ్యర్థాల పారబోత కలకలం

● ఘటనా స్థలం, పరిశ్రమలో అధికారుల తనిఖీలు

జిన్నారం: గడ్డపోతారం పరిధిలోని బహిరంగ ప్రాంతంలో రసాయన వ్యర్థాల పారబోత ఘటన కలకలం రేపింది. శుక్రవారం గడ్డపోతారం గాలి పోచమ్మ దేవాలయం సమీపంలో అసైన్డ్ భూమిలో పరిశ్రమ టాయిలెట్ నీటిలో కలిపి రసాయనాలను పారవేయగా, ఆ ప్రాంతంతో తీవ్ర దుర్గంధం నెలకొన్నది. ఈ ఘటనపై స్థానికులు వేణు, నగేష్, పురుషోత్తమ్, శ్రీకాంత్, లక్ష్మణ్ పీసీబీ అధికారులకు సమాచారం ఇవ్వగా, జోనల్ ఆఫీసర్ రఘు ఘటనాస్థలానికి చేరుకున్నారు. వ్యర్థాలు పారబోసిన తీరును పరిశీలించిన అధికారి ట్యాంకర్ డ్రైవర్, స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. అనంతరం స్థానిక నోచ్‌ల్యాబ్ పరిశ్రమను సందర్శించి శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో వ్యర్థాల నిర్వహణ, ఉత్పాదనల తీరును పరిశీలించారు. తమ పరిశ్రమ నుంచి టాయిలెట్ నీటిని మాత్రమే బయటకు పంపామని పరిశ్రమ ప్రతినిధులు అధికారులకు తెలిపారు. కాగా వ్యర్థాలను బహిరంగ ప్రాంతాల్లో పారబోసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, ఘటనకు కారణమైన ట్యాంకర్‌ను సీజ్ చేశామని జోనల్ ఆఫీసర్ రఘు తెలిపారు.

సీపీఎస్ రద్దు కోసం ఉపాధ్యాయుల ధర్నా


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల ఆందోళన

జిన్నారం: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానం రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం జిన్నారంలో ఉపాధ్యాయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సీపీఎస్‌కు వ్యతిరేకంగా ధర్నా జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ పెన్షన్ హక్కులను కాలరాసేలా ఉన్న ఈ విధానంతో తీవ్రంగా నష్ట పోతున్నామని, బెంగాల్ తరహాలో తెలంగాణలోనూ పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఇందుకోసం దశల వారిగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉపాధ్యాయులు రంగయ్య, కృష్ణమూర్తి, నవీన్, యాదగిరి, నందకుమార్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'త్రివేణి'లో కృష్ణాష్టమి వేడుకలు


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

రామచంద్రాపురం: పట్టణంలోని బీరంగూడ త్రివేణి పాఠశాలలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను చిన్నారులు ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు కృష్ణుడు, రాధ వేశధారణలో తమ పిల్లలను పాఠశాలకు తీసుకువచ్చారు. పాఠశాల ఆవరణలో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వీరేంద్రచౌదరీ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా అన్ని పండుగలను విద్యార్థులతో కలిసి పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌వో సాయి నర్సింహారావు, ఏసీఆర్‌వో సతీష్, ప్రిన్సిపాల్ అర్చన, వైస్ ప్రిన్సిపాల్ భవాని, క్యాంపస్ ఇన్‌చార్జిలు నరేష్, నవీన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విమోచన కమిటీ జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్‌గుప్త

పటాన్‌చెరు: తెలంగాణ విమోచన కమిటీ బీజేపీ జిల్లా కన్వీనర్‌గా సీనియర్ బీజేపీ నాయకుడు పటాన్‌చెరుకు చెందిన బెజుగం శ్రీనివాస్‌గుప్తను నియమిస్తూ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం పటాన్‌చెరు పార్టీ కార్యాలయంలో నియామకపు ఉత్తర్వులను పార్టీ జిల్లా అధ్యక్షుడు బుచ్చిరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజన్‌సింగ్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు బైండ్లకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యు శకటాల్లా పరిశ్రమల బస్సులు

● రోడ్లపై వేగంగా దూసుకెళ్తున్న వాహనాలు ● పట్టించుకోని యాజమాన్యాలు, అధికారులు



బాలుడి మృతికి కారణమైన న్యూలాండ్ పరిశ్రమకు చెందిన బస్సు

పటాన్‌చెరురూరల్: పాశమైలారం పారిశ్రామికవాడలో పలు పరిశ్రమలకు చెందిన బస్సులు మృత్యు శకటాల్లా మారి అమాయకుల ప్రాణాలు తీస్తున్నాయి. శుక్రవారం పాశమైలారం అస్ట్రా పవర్ పరిశ్రమ ఎదుట జరిగిన ప్రమాదంలో న్యూలాండ్ పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొనడంతో 16 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. అతను ఇంద్రకరణ్‌లోని ఓ ప్రైవేటు పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గతంలో కూడా పలు పరిశ్రలకు చెందిన బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి. ఇస్నాపూర్, పటాన్‌చెరు, బీరంగూడ తదితర ప్రాంతాల్లో తిరిగే పలు ప్రైవేటు పరిశ్రమలకు చెందిన బస్సుల డ్రైవర్ల నిర్లక్ష్యంతో వాహనాలను అతి వేగంగా నడపుతున్నారని చాలా మంది ఆరోపించిన సంఘటనలు అనేకం. కాగా పాశమైలారంలో కొంత మంది ప్రైవేటు పరిశ్రమల బస్సు, తదితర వాహనాల డ్రైవర్లు ఆయా బస్టాప్‌లలో ఉన్న మహిళా కార్మికులను తమ వాహనాలు ఎక్కాలని, ఉచితంగా దింపుతామని బలవంతం చేసి వేధిస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. వీరి వాహనాలు ఎక్కకుంటే వారికి అడ్డంగా వాహనాలను నిలుపుతూ వేధిస్తున్నారు. ఇటువంటి సంఘటనలను అడ్డుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సదరు పరిశ్రమల యాజమాన్యాలు కూడా వాహనాల డ్రైవర్లు బయట వేసే ఆగడాలపై దృష్టి సారించలేదు.

పరిశ్రమల వద్ద వాహనాల నిలుపుదల

హత్నూర: గుండ్లమాచునూర్‌లో గల పరిశ్రమల వద్ద సంగారెడ్డి-నర్సాపూర్ రహదారికిరువైపులా వాహనాలు ఇష్టానుసారంగా నిలపడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిశ్రమల్లోకి ముడిసరుకును తీసుకొస్తున్న లారీలు రోడ్డుకిరువైపులా నిలుపడంతో ఆ రహదారిగుండా వెళ్లే వాహనదారులు తరుచూ ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడ్డ సంఘటనలు ఉన్నాయి. ఈ విషయమై పరిశ్రమల యాజమాన్యాలు, ఆర్అండ్‌బీ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పోచమ్మ ఆలయం పునఃప్రతిష్ఠ

రామచంద్రాపురం: వెలిమెల గ్రామంలోని పాత ఈదమ్మ, పోచమ్మ ఆలయాన్ని శుక్రవారం పునఃప్రతిష్ఠించారు. శరవేగంగా నిర్మించిన ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. వెలిమెల పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఆర్అండ్‌బీ రోడ్డులో ఉన్న పోచమ్మ ఆలయాన్ని దశాబ్దం క్రితం ఎస్సీ బస్తీ పక్కకు తరలించి, అక్కడ నూతన నిర్మాణ పనులు ప్రారంభించారు. నూతన నిర్మాణం 90 శాతం వరకు పూర్తి అయింది. అయితే ఇటీవల ఈ ఆలయంపై పోలీసు కేసు, మరో వైపు ఈ ఆలయం పై తీర్పు హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పాత ఆలయాన్ని పది రోజుల వ్యవధిలో పూర్తి చేసి, శుక్రవారం విగ్రహప్రతిష్ఠ, ఆలయ పునరుద్ధరణ కార్యక్రమం స్థానికంగా చర్చాంశనీయమైంది. ఎంపీపీ యాదగిరియాదవ్, జడ్పీటీసీ రాములు గౌడ్, ఎంపీటీసీ శోభ, సి.అంజిరెడ్డి పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'టీమాస్' ఆవిర్భావ పోస్టర్ విడుదల

పుల్‌కల్: తెలంగాణ ప్రజా సామాజిక సంఘాల ఐక్య వేదిక (టీ.మాస్ ఫోరం) ఆవిర్భావ సభ పోస్టర్‌ను శివంపేటలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 13న సంగారెడ్డిలోని బాలాజీ గార్డెన్స్‌లో ఆవిర్భావ సభ జరుగనున్నది, ఈ సందర్భంగా కళాకారులచే ఆట, పాట కార్యక్రమం ఉంటుందని సీఐటీయూ మండల అధ్యక్షుడు నాగభూషణం తెలిపారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, నాయకులు మాణిక్యం, పాండు, శ్రీశైలం, మల్లేశం, సురేష్, విఠల్, రామస్వామి, మల్లేశం, లక్ష్మణ్, సాయికుమార్, సదానందం, రమేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి'

జోగిపేట: బ్యాంకులు ఇస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డీబీ నాగభూషణం సూచించారు. శుక్రవారం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బ్యాంకులు ఇస్తున్న రుణాలను తీసుకుని అవసరాలకు వినియోగించుకోవడమే గాకుండా, వాటిని తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు. దీంతో బ్యాంకుల్లో పరపతి పెరిగి, త్వరగా కొత్త రుణాలు పొందొచ్చన్నారు. బ్యాంకు శాఖ మేనేజర్ మారుతి మాట్లాడుతూ రుణాలు తీసుకోవడంతోనే సరిపెట్టకుండా వాటిని సకాలంలో చెల్లించాలన్నారు. బ్యాంకులు రైతుల కోసం ఎన్నోరకాలైన రుణాలను అందిస్తున్నాయన్నారు. వాటినన్నింటినీ వినియోగించుకోవాలని, రైతులకు సేవ చేసేందుకు తమ బ్యాంకుశాఖ ఎప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం ఇద్దరు రైతులను బ్యాంకు తరఫున నాగభూషణం సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాదులాపూర్ సర్పంచ్ నర్సింహులు యాదవ్, అధ్యాపకుడు డాక్టర్ ఆకుల వెంకటేశం పాల్గొన్నారు.


రైతును సన్మానిస్తున్న చైర్మన్ నాగభూషణం

బొల్లారంలో గొర్రెల పంపిణీ

జిన్నారం: బొల్లారంలో గొల్లకుర్మలకు ప్రభుత్వం అందజేసిన గొర్రెలను పంపిణీ చేశారు. శుక్రవారం సర్పంచ్ రోజారాణి, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి లబ్ధిదారులకు గొర్రెలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గొల్లకుర్మలకు గొర్రెల పంపిణీతో ఆర్థికంగా చేయూతనివ్వడం సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీరప్ప, నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లి పంచాయతీకి తాళం

• కార్యదర్శి నుంచి కారోబార్ వరకు విధులకు డుమ్మా

కంది: మామిడిపల్లి పంచాయతీ భవనానికి తాళం వేశారు. ప్రజాప్రయోజనాలను పక్కన పెట్టి ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. పని వేళల్లో కార్యాలయానికి తాళం వేసి వెళ్లడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:30 గంటల సమయం పంచాయతీ కార్యాలయంలోని అన్ని గదులకు తాళాలు కనిపించాయి. కార్యాలయ ప్రధాన ద్వారాన్ని తెరిచి ఉంచి లోపలి గదులకు తాళాలు వేశారు. ఇక్కడ పని చేసే పంచాయతీ కార్యదర్శి నుంచి మొదలుకొని కారోబార్ వరకు అంతా తమ విధులను మరిచి వెళ్లిపోవడంతో కార్యాలయం బోసిపోయి కనిపించింది. పని వేళల్లో సెలవు పెట్టకుండా విధులకు ఎగనామం పెట్టి వెళ్లడం గ్రామస్థులను ఆశ్చర్యానికి గురి చేసింది. పంచాయతీ కార్యదర్శి శ్రీలత, వీఆర్వో శ్రీనివాస్ ఎర్దనూర్ గ్రామ



కార్యాలయం గదులకు తాళాలు వేసిన దృశ్యం

పంచాయతీలో అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరితోపాటు పంచాయతీ పరిధిలో వీఆర్ఏలు నలుగురు, సఫాయి కార్మికులుగా మరో నలుగురు, కారోబార్, ఎలక్ట్రిషన్‌లు పని చేస్తున్నారు. అయితే సఫాయి కార్మికుల్లో ఇద్దరు దత్తత గ్రామమైన కొలంపేట చెరువులో మొక్కలు నాటే దానిపై గడ్డి చెక్కడానికి వెళ్లినట్లు తెలిసింది. వీఆర్వో శ్రీనివాస్ విషయానికి వస్తే ఆయన ప్రతి మంగళవారం కార్యాలయంలో అందుబాటులో ఉంటారని గోడపై రాసి ఉంచారు. ఇక పంచాయతీ కార్యదర్శి శ్రీలతను ఫోన్ ద్వారా వివరణ కోరగా, సర్పంచ్ సుగుణ అనుమతితో బంధువుల పెళ్లికి వెళ్లినట్లు చెప్పారు. ఇదిలా ఉంటే సర్పంచ్ అందుబాటులో లేకపోవడంతో ఆమె భర్త మధు సిబ్బంది వ్యవహార తీరుపై బదులిచ్చారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ రోజు ఒక్క రోజే ఎవరు లేకుండా పోయారని, కారోబార్ మల్లేశ్ సర్పంచ్ అనుమతి తీసుకుని బంధువుల పెళ్లికి సంగారెడ్డి వెళ్లినట్లు మధు తెలిపారు. అయితే పలువురు వివిధ పనులకు కార్యాలయానికి వచ్చి ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగినట్లు తెలిపారు. కార్యాలయంలో ఎవరూ అందుబాటులో లేకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

• ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్

సంగారెడ్డి రూరల్: నారాయణఖేడ్ మండలం మంగల్‌పేట్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు రవితేజ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో శుక్రవారం విద్యాశాఖ సూపరింటెండెంట్ ఖదీర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని నారాయణ్‌ఖేడ్‌కు చెందిన సాయి సంజీవని నర్సింగ్ హోం హాస్పిటల్ యాజమాన్యం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నదని, ఈ విషయాన్ని ఇదివరకే విద్యాశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కనీసం ఇప్పటికైనా కబ్జాదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, రాజు, సందీప్, బాలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకే'

సంగారెడ్డి రూరల్: విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నులి పురుగుల మందులను పంపిణీ చేసినట్లు పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ సుమంగళి చంద్రశేఖర్ తెలిపారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నులి పురుగుల మందులు పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. విద్యార్థులకు నూలి పురుగుల మందులను పాఠశాలల్లోనే కాకుండా ఇంటింటికి తిరిగి అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో బడికి రాని పిల్లల ఆరోగ్యాలను కూడా కాపాడిన వారమవుతామని అన్నారు. దీనికి కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమృత్ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ' గుర్తింపును రద్దు చేయాలి

సంగారెడ్డి రూరల్: విద్యార్థులను వేధింపులకు గురి చేస్తూ ఆత్మహత్యలకు కారణమవుతున్న నారాయణ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో సంగారెడ్డిలో కళాశాల యాజమాన్య దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రాజు, సంతోష్, తరుణ్, రాజేష్ పాల్గొన్నారు.

'ఎన్‌వైకేఎస్' స్వచ్ఛ్ పక్వాడ

సంగారెడ్డి రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్‌లో భాగంగా నెహ్రూ యువజన కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డిలో స్వచ్ఛ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలోని వివేకానంద విగ్రహాన్ని నీటితో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకేఎస్ సంగారెడ్డి బ్లాక్ ప్రతినిధి శశ్వంత్‌గౌడ్, పట్టణ కౌన్సిలర్లు రమేశ్ కుమార్, మురళీధర్ రెడ్డి, సభ్యులు మహేశ్ చారి, నవీన్ యాదవ్, అనిల్‌రెడ్డి, నరేశ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సీఐటీయూ మద్దతు

సంగారెడ్డి రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహ్మారెడ్డి, కె.రాజయ్య తెలిపారు. శుక్రవారం కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరానికి వెళ్లి మద్దతు పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ కేంద్రాల్లో 12 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ ప్రమేయం లేకుండా పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా 108 ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

నేడు 'టీఎస్‌యూటీఎఫ్' సమావేశం

సంగారెడ్డి రూరల్: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 12వ తేదీన ఉదయం 10.30 గంటలకు సంగారెడ్డిలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.లక్ష్మారెడ్డి, సాయిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంఘం నాయకులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

పారిశుధ్యంపై విద్యార్థుల ప్రచారం

పటాన్‌చెరు: సంపూర్ణ పారిశుధ్యంపై పట్టణంలోని అంబేద్కర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన కల్పించి ప్రచారం నిర్వహించారు.

'నిరుద్యోగ సమస్యను రూపుమాపాలి'

సంగారెడ్డి రూరల్: స్వాతంత్రం సిద్ధించి 70 సంవత్సరాలు పూర్తయినా నిరుద్యోగ సమస్య మాత్రం అలాగే ఉన్నదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యాదగిరి విమర్శించారు. స్థానిక నాగార్జున డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి రాక ముందు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఆశలు రేపి అధికారంలోకొచ్చిన తరువాత పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అ మలు చేయాలని లేని పక్షంలో నిరుద్యోగులను ఏకం చేసి సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సెమినార్‌లో ఎస్ఎఫ్ఐ



సెమినార్‌లో మాట్లాడుతున్న యాదగిరి

జిల్లా కార్యదర్శి రమేష్, బాల్‌రాజ్, శ్రీశైలం, తేజ, మురళి, రాజు, రవి పాల్గొన్నారు.

'మొక్కల సంరక్షణ అందరి బాధ్యత'



మొక్కను నాటుతున్న తహసీల్దార్ ప్రభావతి

హత్నూర: హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దార్ ప్రభావతి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందరూ భాగస్వాములై ప్రభుత్వ ఖాళీ స్థలాలు, ఇళ్ల ఎదుట మొక్కలు నాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాల్‌రాజ్, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

"విమోచనం"ను అధికారికంగా నిర్వహించాలి'

సదాశివపేట రూరల్: సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఉప తహసీల్దార్ ఆశాజ్యోతికి వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలో జాతీయ పతకాన్ని ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోవూరి సంగమేశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షుడు వోదేల మాణిక్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



పుల్కల్ డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాగం భిక్షపతి, మల్లేశ్, సీహెచ్ నర్సింహులు, నందారెడ్డి, రాములుయాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో

రామచంద్రాపురం: తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కరికె చంద్రయ్య ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్‌కు వినతి పత్రం సమర్పించారు.

పుల్‌కల్‌లో

పుల్‌కల్: సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు రాజు అధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దారు వంశీధర్‌కు వినతి ప్రతం అందజేశారు. ఏ.లక్ష్మణ్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'లో ఈసీసీఈ దినోత్సవం

జోగిపేట: ప్రతి నెలా పిల్లల్లోని శారీరక ఎదుగుదలతోపాటు వారి వ్యక్తిత్వ వికాసం, మానసిక ఎదుగుదల, చదువుపై సమీక్ష జరిపేందుకే ఎర్లీ చైల్డ్‌హుడ్, కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) కార్యక్రమాన్ని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నామని జోగిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ అఖ్తర్ ఖాతూన్ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని పోతిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈసీసీఈ సమావేశానికి హాజరైనారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ పిల్లల తల్లి లేదా సంరక్షులాలితో పేరెంట్ టీచర్ మీటింగ్ ఏర్పాటుచేసిన పిల్లల శారీక, మానసిక ఎదుగుదలపై ప్రీస్కూల్ అసెస్‌మెంట్ కార్డ్ (పీఏసీ) పేరిట రూపొందించిన ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను పిల్లల తల్లులకు అందజేస్తామన్నారు. తద్వారా తమ పిల్లల వికాసాన్ని తల్లులు తెలుసుకోవచ్చన్నారు.

'మూడెకరాల భూమి హామీ ఏమాయె!'

కంది: సీఎం కేసీఆర్ దళితులకు ఇస్తానన్న మూడెకరాల భూమి హామీ ఏమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.సాయిలు ప్రశ్నించారు. మండల కేంద్రంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల పంట భూములు ఇస్తామని కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. ఒకవేళ ప్రభుత్వ భూములు అందుబాటులో లేని ప్రాంతంలో ప్రైవేట్ భూములను కొనుగోలు చేసి భూములు పంచిపెడతామన్న ఆయన తీరా అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మరిచారని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.ఏ. ఖాజా, సభ్యులు ఎన్.శ్రీనివాస్, జైపాల్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానం అమలు చేయాలి'

గుమ్మడిదల: మండలంలో ఉపాధ్యాయులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న పెన్షన్ హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిన్నారం ప్రధాన కార్యదర్శి రంగయ్యనాయుడు, గుమ్మడిదల ప్రధాన కార్యదర్శులు కృష్ణమూర్తి, నవీన్, ఎస్‌టీఎఫ్ నాయకులు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
8
నారాయణఖేడ్
సంగారెడ్డి ●శనివారం 12 ఆగస్టు 2017
నారాయణఖేడ్ । మనూరు । కంగ్టి । కల్హేర్ । సిర్గాపూర్ । నాగల్‌గిద్ద

నారాయణఖేడ్ సినిమాలు

షెట్కార్‌సువర్ణ	జయ జానకి నాయక	
వెంకటేశ్వర		లై

పెద్దశంకరంపేట

లక్ష్మి	జయ జానకి నాయక

నీటి బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం

- అప్పులు చేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- బిల్లులు అందక అప్పుల వడ్డీలు రెట్టింపు
- ఆందోళన చెందుతున్న కాంట్రాక్టర్లు

మనూరు/నాగల్‌గిద్ద : 2016 వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్న విషయం విదితమే. దీంతో ప్రభుత్వం గ్రామాల్లో ప్రజల దాహార్తి తీర్చడానికి ట్రాన్స్‌ఫోర్టు ద్వారా నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంది. దీంతో మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లోని వివిధ గ్రామాల్లో కాంట్రాక్టర్లు వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసుకొని ట్రాక్టర్ల ద్వారా ప్రతి గ్రామం , గిరిజన తండాల్లో రోజుకు మూడు, నాలుగు ట్రిప్పులు ట్యాంకర్లతో వాటర్ సరఫరా చేశారు. ఈ ట్యాంకర్లను ఏర్పాటు చేయడానికి మరికొందరు అద్దెకు తీసుకోవడానికి అప్పులు చేసి వేసవిలో మూడు నెలలు గ్రామాలకు నీళ్ల సరఫరా చేశారు. మనూరు ఉమ్మడి మండలంలో 45 గ్రామాలు, 55 గిరిజన తండాలు ఉండగా ఇందులో 90 శాతం గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందని కంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాలకు చేరుకుంటున్నా బిల్లులు ఇవ్వక పోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి పోతున్నాయని ఆయా గ్రామాల కాంట్రాక్టర్లు వాపోతున్నారు. రెండు విడతలుగా బిల్లులు చెల్లించినప్పటికీ ఇంకా మండలంలో ఆయా గ్రామాలకు సంబంధించి రూ.50 లక్షలు చెల్లించాల్సి ఉందని అధికారులు తెలుపుతున్నారు. వేసవి కాలంలో ప్రజలు దాహంతో అల్లాడి పోతున్న సమయంలో అప్పులు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన వారి బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

నీటి సరఫరా కోసం చేసిన అప్పులు రెట్టింపయ్యాయి
- బస్‌రెడ్డి, కాంట్రాక్టర్



2016లో వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడానికి చేసిన అప్పులు రెట్టింపు అయ్యాయని బెల్లాపూర్‌కు చెందిన కాంట్రాక్టర్ బస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలకు చేరుకుంటున్న తమ బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందని అందువల్ల జిల్లా అధికారులు స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ఆయన కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మనూరు/నాగల్‌గిద్ద : మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని ట్రాన్స్‌కో ఏఈ మాణెయ్య శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అందరూ విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

'పాత పెన్షన్ విధానం అమలు చేయాలి'

కంగ్టి : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కంగ్టిలో తహసీల్దార్ రాజయ్యకు వినతి పత్రం అందజేశారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగుల కుటుంబీకులకు పెన్షన్ రావడం లేదన్నారు. సీపీఎస్ విధానంతో తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వెంకట్, యాదయ్య, గురునాథ్, సంతోష్‌రెడ్డి, శశికళ పాల్గొన్నారు.

ఈ-పాస్ యంత్రాలపై డీలర్లకు అవగాహన

కల్హేర్ : డీలర్లకు పంపిణీ చేసిన ఈ-పాస్ యంత్రాలపై శుక్రవారం కల్హేర్ తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. త్వరలో అన్ని గ్రామాల్లో ప్రజలకు ఈ యంతాల్ర ద్వారానే రేషన్ సరుకులు అందజేయనున్నారు. డీలర్లకు సాంకేతిక కన్సల్‌టెంట్ దత్తారెడ్డి అవగాహన కల్పించారు. ఈ - పాస్ యంత్రంతో పాటు వేయింగ్ మిషన్‌పై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీలు లక్ష్మణ్, వెంకటేశ్వర రావు, డీలర్లు పాల్గొన్నారు.

'ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి '



బోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్న సంగ్రాం మహరాజ్

నారాయణఖేడ్ : ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాద్వార్ తండాలో నిర్వహించిన బోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుందన్నారు. అనంతరం సేవాలాల్ సంఘం నాయకుడు రమేష్ చౌహాన్ మాట్లాడుతూ మాధ్వార్ తండాలో భవానీ మాత, సేవాలాల్ మహరాజ్ మందిరాల నిర్మాణం కోసం మంత్రి హరీశ్‌రావు స్వయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించాడని, ఈ నిధులతో నిర్మాణ పనులను ప్రారంభించడమే కాకుండా బోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. రాజునాయక్ పాల్గొన్నారు.

'సస్యరక్షణ చర్యల సమయంలో రైతులు కనీస జాగ్రత్తలు పాటించాలి'

నారాయణఖేడ్ : పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపడుతున్న సమయంలో రైతులు కనీస జాగ్రత్తలను పాటించాలని మారోల్ సొసైటి అధ్యక్షుడు గోళి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ర్యాకల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పురుగు మందుల నివారణ కోసం రైతులు పిచికారి చేస్తున్న సమయంలో జాగ్రత్తలు పాటించక పోవడంతో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తమ సంస్థ తరఫున రైతులకు చేతులకు గ్లౌజులు, ముఖాలకు మాస్కులను కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు విద్యాసాగర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, అంజన్న పాల్గొన్నారు.

'వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించాలి'

నారాయణఖేడ్ : వసతి గృహాలలో కనీస వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేణు కోరారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ 82వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ నాయకులు చెప్పే మాటలకు చేసే చేతలకు పొంతన లేదన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అని జిల్లా అధ్యక్షకార్యదర్శులు దత్తురెడ్డి, కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఆనంద్, స్థానిక నాయకులు మురళి, విఠల్‌రెడ్డి, మల్లేశం, రవీందర్ పాల్గొన్నారు.

'నేటి అభివృద్ధిని నాడే చేశామంటారా ?'

- కాంగ్రెస్‌పై టీఆర్ఎస్ నాయకుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ నాయకులు

నారాయణఖేడ్ : నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధి గురించి పట్టించుకోకుండా నేడు జరిగిన అభివృద్ధి తామే చేశామనడం వింతగా ఉందని టీఆర్ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు రవీందర్‌నాయక్, ఎంపీటీసీలు ముజమ్మిల్ , రామక్రిష్ణ, తుర్కపల్లి సర్పంచ్ పరమేశ్వర్ లు మాట్లాడుతూ కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాసన సభ సాక్షిగా తెలంగాణ అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఇవ్వనని తెలిపినా అప్పటి కాంగ్రెస్ నాయకులు నోరు మెదప లేదన్నారు. అంతే కాకుండా అభివృద్ధి పనుల్లో అవినీతి చోటు చేసుకుందన్నారు. అయినప్పటికీ వాటిని కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుతం టీఆర్ఎస్ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాన్ని స్థానిక ఎంపీపీ సంజీవరెడ్డి చేయడం ఏమిటన్నారు. ఇప్పటికైనా ఆయన తన విధానాన్ని మార్చుకోవాలని లేని పక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాంచందర్, వెంకట్, దేవిసింగ్, విఠల్, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ నాయకుల్లారా ఖబడ్దార్'



మాట్లాడుతున్న టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్‌రావు

సిర్గాపూర్ : స్థానిక కాంగ్రెస్ నాయకులు తమ నోరును అదుపులో పెట్టుకొని వాస్తవాలు మాట్లాడాలని ప్రజలను మభ్యపెట్టే మాటలు చాలించాలని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన సిర్గాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో జరిగిన అభివృద్ధి, అవినీతిని ప్రజలు గమనించి వారిని చీదరించుకున్నారన్నారు. ప్రస్తుతం నారాయణఖేడ్ ప్రాంతంలో అభివృద్ధికే అందరూ జై కొడుతుంటే మింగుడు పడని నాయకులు ఏ మాత్రం కళ్లులేని కబోదుల్లా మాట్లాడు తున్నారన్నారు. నియోజకవర్గంలో టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, పెన్షన్, 24 గంటల కరెంటు, మొదలు కానున్న మిషన్ భగీరథను చూసి ఇక తమకు తమ రాజకీయ భవిష్యత్ శూన్యమేనని పిచ్చి వారై మాట్లాడుతున్నారన్నారు. ఇకనైన తమ నోళ్లను అదుపులో ఉంచుకోవాలని ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. నాయకులు యాదవరావు, హన్మండ్లు, సత్యనాయక్, హుల్బారావు, బద్రు ఉన్నారు.

'స్వయం ఉపాధి పథకాలతో నిరుద్యోగులు ఉపాధి పొందాలి'

నారాయణఖేడ్ : నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి పథకాలతో ఉపాధి పొందాలని జిల్లా గొర్రె కాపరుల సహకార సంఘం చైర్మన్ బాపుమల్‌శెట్టి కోరారు. శుక్రవారం నారాయణఖేడ్‌లో ఆటోమెటిక్ బైక్ వర్క్ షాపును ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ యువకులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద్‌యాదవ్, పుండ్లిక్ ఉన్నారు.

తడ్కల్ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడుగా పాండు

కంగ్టి : మండల పరిధిలోని తడ్కల్ గ్రామ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడుగా పాండు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడుగా క్రిష్ణ, కార్యదర్శిగా భరత్, కోశాధికారిగా సాయిలు, సలహాదారులుగా యాదు, పెద్ద సాయిలు, కిషన్, నర్సప్పలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

శెల్గిరలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

నారాయణఖేడ్ : మండల పరిధిలోని శెల్గిరలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నిరంజన్, సర్పంచ్ దుర్గయ్య, కార్యదర్శి యాదయ్య, మాజీ సర్పంచ్ పెంటయ్య, అంగన్‌వాడీ టీచర్‌పాల్గొన్నారు.

రేపు పంచగామలో యోగా శిబిరం

నారాయణఖేడ్ : పంచగామ నగిరేశ్వర దేవాలయం ఆవరణలో ఆదివారం యోగా శిబిరం నిర్వహించనున్నామని ఆశ్రమ పీఠాధిపతి కాశీనాథ్ బాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలని యోగా వల్ల మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. నారాయణఖేడ్ ప్రాంత ప్రజల సౌలభ్యం కోసం యోగా శిబిరాన్ని ఆదివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరక్కు 3 నుంచి 5 గంటల వరకు యోగా మాస్టర్ శశిభూషన్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నామన్నారు.

'గొర్రెలకు బీమా సౌకర్యం కల్పించాలి'

నారాయణఖేడ్ : ప్రభుత్వం గొల్ల కుర్మలకు అందిస్తున్న గొర్రెలకు బీమా సౌకర్యం కల్పించి మృతి చెందిన జీవాలకు పరిహారం ఇప్పించాలని రైతు సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నగేష్ యాదవ్ శుక్రవారం కోరారు. ప్రభుత్వం గొర్రె కాపరులకు జీవాలను కొనుగోలు చేసి ఇస్తున్నప్పటికీ వాటిని లబ్ధిదారుల వద్దకు చేర్చే వరకు కొన్ని చనిపోతున్నాయన్నారు.

జహీరాబాద్ సినిమాలు

మోహన్	ఫిదా
సినీమ్యాక్స్	నేనే రాజు, నేనే మంత్రి
అనురాగ్	జయ జానకి నాయక

వర్షంతో పంటలు కళకళ



కళకళలాడుతున్న పత్తి పంట

ఝరాసంగం: ఈ సంవత్సరం వర్షాలు ముందుగానే కురవడం వల్ల పంటల సాగు జోరందుకుంది. రైతులు పంటలను సాగు చేసుకుని వాటికి అవసరమయ్యే డీఏపీ, యూరియా, కలుపుతీత పనులు చేపట్టారు. ఎకరానికి వేలాది రూపాయలను పంట సాగు కోసం వెచ్చించారు. మొదట పంటలకు అనుకూలంగా వర్షాలు కురిసినప్పటికి పంటలు ఏపుగా పెరిగే సమయంలో వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గత రెండు, మూడు రోజుల నుంచి వర్షాలు కురవడంతో రైతులు సాగు చేసిన పంటలకు జీవనం పోసినట్లయింది. మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని చీలపల్లి, కుప్పానగర్, బర్దిపూర్, క్రిష్ణాపూర్, బిడకన్నె, బోరెగావ్, జీర్లపల్లి, చీలేమామిడి, ఏడాకులపల్లి తదితర గ్రామాల్లోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేశారు. మండలంలో 5,800ఎకరాల్లో పత్తి, 605ఎకరాల్లో కంది, 203ఎకరాల్లో మినుము, 635ఎకరాల్లో సోయాబీన్, 630ఎకరాల్లో మొక్కజొన్న, 450ఎకరాల్లో పెసర పంటలను సాగు చేశారు. గత మూడు రోజులుగా కురిసిన మోస్తారు వర్షాలకు పంటలన్నీ పచ్చగా మారాయి. ప్రస్తుతం రైతులు పంటలకు చీడపురుగుల నివారణకు మందులను పిచికారి చేయడంలో బిజీగా ఉన్నారు. అదే విధంగా చెక్‌డ్యాంలు, వాగుల్లోకి నీరు వచ్చి చేరింది. దీంతో భూగర్భ జలాలు పెరగడం వల్ల వ్యవసాయ బోర్లలో కూడా నీరు వచ్చి చేరింది.

వర్షాలు ఎంతో మేలు చేశాయి

-నాగిరెడ్డి, చీలపల్లి



గత 20రోజుల నుంచి వర్షాలు ముఖం చాటేయడంతో పంటలన్నీ ఎండుముఖం పట్టడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాం. పంటలు చేతికి వస్తాయో లేదో అని దిగులు చెందాం. వర్షాలు కురువాలని గ్రామ దేవతలకు పూజలు సైతం చేశాం. ఇటీవల కురిసిన వర్షాలు పంటలకు ఎంతో మేలు చేశాయి.

కొనసాగుతున్న లక్షబిల్వార్చన కార్యక్రమం



ఆలయంలో బిల్వార్చన నిర్వహిస్తున్న భక్తులు

కోహీర్: మండల పరిధిలోని బడంపేట గ్రామంలోని శ్రీరాచన్నస్వామి దేవాలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని లక్షబిల్వార్చన కార్యక్రమం కొనసాగుతుంది. అందులో భాగంగా శుక్రవారం ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసం ముగింపు వరకు బిల్వార్చన కార్యక్రమం ప్రతి రోజు జరుగుతుందని ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి సందర్భంగా వివిధ వేషధారణలతో చిన్నారులు

జహీరాబాద్: పట్టణ సమీపంలోని అల్లీపూర్ ప్రాంతంలోని శ్రీక్రిష్ణవేణి పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ నాట్యరీతులను నేర్చుకుని వేషధారణ చేసి ఈ వేడుకల్లో ప్రదర్శనలు చేశారు. గొల్లభామల, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు పలువురిని ఆకర్షించారు. అనంతరం ఉట్టిగొట్టే కార్యక్రమం నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.పాఠశాల చైర్మన్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కలీముల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణి



దుస్తులను పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు డి.విఠల్

రాయికోడ్: ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన యూనిఫారం దుస్తులను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.విఠల్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులందరికి యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందజేస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన కొనసాగుతుందన్నారు. విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యా కమిటీ చైర్మన్ జి.గోపాల్, ఉపాధ్యాయులు శ్రీరాములు, రజనీకాంతం, సుధాకర్, శివకుమార్ ఉన్నారు.

'టీ-మాస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి'

ఝరాసంగం: ఈ నెల 13వ తేదీన సంగారెడ్డిలో నిర్వహించే టీ-మాస్(తెలంగాణ ప్రజా సామాజిక సంఘాల ఐక్య వేదిక) ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో చలో సంగారెడ్డి టీ-మాస్ ఆవిర్భావ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటి వరకు నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలను కల్పించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. మనోహర్, నర్సింలు, ఉల్లాస్, జగన్, శంకర్, నర్సింలు, రాజు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

'మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి'

రాయికోడ్: మండలంలోని ఆయా గ్రామాలలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్ల పనులను వేగవంతం చేయాలని ఉపాధిహామీ ఈసీ విష్ణువర్ధన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కర్చల్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. అంటువ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చన్నారు. ప్రతి గ్రామంలో వంద శాతం మరుగుదొడ్లు నిర్మించుకుని నిర్మల్ పురస్కార్ పొందాలని, ప్రభుత్వం ద్వారా వచ్చే నగదును పొందవచ్చన్నారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

'పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం'

జహీరాబాద్: పంచాయతీరాజ్ వ్యవస్థను టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారం పల్లిమల్లారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు ఉన్న ఆర్థిక వనరులను ప్రభుత్వం దక్కకుండా చేస్తుందన్నారు. సర్పంచుల పాత్రను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాభివృద్ధికి సర్పంచులే కీలకమన్నారు. 29అంశాలను గ్రామ పంచాయతీలకు బదిలీ చేస్తామని ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్ హామీనిచ్చిన విషయం మరిచిపోయిందన్నారు. నిమ్జ్ భూముల సేకరణలో కూడా గ్రామ పంచాయతీల ప్రాధాన్యతను తగ్గిస్తున్నారన్నారు. 1044జీవో ద్వారా భూముల సేకరణ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవడం ఎంతవరకు సమంజసమన్నారు. నిమ్జ్‌లో భూనిర్వాసితులకు తగిన న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్, భూనిర్వాసితుల సంఘం నాయకులు మహిపాల్, మాజీ ఎంపీపీ విలాస్‌రెడ్డి, హుసెల్లి సర్పంచ్ మోహన్‌రెడ్డి, సంగారెడ్డి, అంజిరెడ్డి, విఠల్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నమల్లారెడ్డి

కేతకీలో భక్తుల పూజలు

ఝరాసంగం: మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలను చేపట్టారు.

భక్తులతో కిటకిటలాడిన సిద్ధివినాయక ఆలయం

న్యాల్‌కల్: మండలంలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంబుగా వెలిసిన శ్రీసిద్ధివినాయక ఆలయంలో శుక్రవారం సంకష్టహరచతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని ఆలయ పురోహితులు తెల్లవారుజామునే స్వామివారికి అభిషేక కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

పొలం పనుల్లో రైతులు బిజీ

రాయికోడ్: గత 20రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో దిగులు చెందిన రైతులు ఇటీవల కురిసిన మోస్తారు వర్షాలకు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే రైతులు తమ పంట పొలాల్లో కలుపుతీత, దుండెపట్టడంలాంటి పనులు చేస్తున్నారు. ఏ గ్రామంలో చూసిన ఏ ఒక్క రైతు కూడా ఇళ్ల వద్ద కనిపించక పొలం పనుల్లోనే బిజీ అయ్యారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

న్యాల్‌కల్: కేంద్ర ప్రభుత్వం అందజేసే జాతీయ ఉపకార వేతనాలకు న్యాల్‌కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సునీత, లక్ష్మి, సవితలు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీహరి తెలిపారు. వీరు పీజీ చదివేంత వరకు ప్రతి సంవత్సరం 10వేల రూపాయల ఉపకార వేతనం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్యార్థినులు ఎంపికకావడంపై కళాశాల అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేశారు.



ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచిన డ్రెస్‌లు

చేనేతకు చేయూత

చేనేత కార్మికులు, ఉత్పత్తిదారులపై ఏ ప్రభుత్వం ఇప్పటి వరకు పన్ను వేయలేదు. అయినా ఈ రంగం అంతంత మాత్రంగానే నడుస్తోంది. కొద్ది రోజుల క్రితం వరకు చేసిన పనులకు గిట్టుబాటు లభించక, మార్కెట్‌లో ఈ రంగానికి ఆదరణ లేక చేనేత కళాకారులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇప్పుడిప్పుడే తెలంగాణ ప్రభుత్వం చేనేత అభివృద్ధికి పలు పథకాలను ప్రకటించడంతో ఉత్పత్తిదారుల్లో కొంత మేరకు ఆశలు రేకెత్తించాయి. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్‌టీ ఈ రంగాన్ని తిరిగి వెనక్కి పంపేలా ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం కేవలం 5 శాతం జీఎస్టీ మాత్రమే చేనేత రంగంపై విధిస్తున్నట్లు పేర్కొంటున్నా వాస్తవానికి ఈ పన్ను 35 శాతం వరకు చెల్లించాల్సిన పరిస్థితులు ఉత్పత్తిదారులకు ఏర్పడుతున్నాయి. ముడిసరుకుపై 5 శాతం, జరీ పై 13 శాతం, డైస్, కెమికల్స్‌పై 12 శాతం, పనితనంపై 5 శాతం జీఎస్టీ కట్టాల్సి వస్తోందని కార్మికులు చెబుతున్నారు. దీంతో పాటు వెయ్యిలోపు చీరలపై 5 శాతం మాత్రమే జీఎస్టీ వసూలు చేస్తున్నా వెయ్యి దాటిన చీరలపై 13 శాతం వసూలు చేస్తున్నారని ఉత్పత్తిదారులు, కళాకారులు పేర్కొంటున్నారు. దీనిపై చాలా మందికి అవగాహన లేకపోవడంతో తెలియడం లేదని వివరిస్తున్నారు. చాలా మంది కళాకారులకు లభించే 5 శాతం ఆదాయం కూడా జీఎస్టీకే చెల్లిస్తే వారికి మిగిలేది ఏమి ఉండదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం, సహకార సంఘాలు, నిపుణులు కేంద్రం దృష్టికి తీసుకువెళ్ళి జీఎస్టీ కౌన్సిల్‌లో చర్చించి చేనేత ఉత్పత్తులకు పూర్తిస్థాయిలో మినహాయింపు ఇవ్వాలని కళాకారులు కోరుతున్నారు. నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో జరుగుతున్న చేనేత, టెక్స్‌టైల్స్ ప్రదర్శనలో స్టాళ్ల నిర్వాహకులు, అధికారుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



పడిలేస్తున్న చేనేతపై జీఎస్టీ పోటు





చేనేత ప్రదర్శనలో సందర్శకులు





- పరిశ్రమ అభివృద్ధికి ఆటంకంగా మారిందంటున్న కార్మికులు
- కేంద్రం చేనేతకు మినహాయింపు ఇవ్వాలని వినతి

ఈ రంగాన్ని వ్యాపారంగా చూడకండి...

చేనేత రంగాన్ని ప్రభుత్వాలు వ్యాపారంగా చూడకూడదు. దీనిని ఓ కళలా భావించి ఆదరించి ప్రోత్సహించాలి. ఇప్పటి వరకు మేము ఎలాంటి పన్నులూ చెల్లించలేదు. చేనేత కార్మికులు పన్ను చెల్లిస్తే వారికి మిగిలేది ఏమీ ఉండదు. ఈ రంగాన్ని ప్రోత్సహించాలనే ఆలోచన ఉంటే వెంటనే జీఎస్టీ పన్ను నుంచి దీనికి మినహాయిస్తున్నట్లు ప్రకటించాలి. ఈ విషయమ్మై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉంది.



- శ్రీనివాస్, సుప్రజా ఫ్యాబ్రిక్స్, యాదాద్రి (స్టాల్ హోల్డర్)

5 శాతం కాదు.. 35 శాతం పన్ను అమలవుతోంది..

కేంద్ర ప్రభుత్వం చేనేత ఉత్పత్తులపై కేవలం 5 శాతం మాత్రమే జీఎస్టీ విధిస్తున్నట్లు పేర్కొంటున్నా పరోక్షంగా 35 శాతం పన్ను వసూలు చేస్తోంది. దారంపై 5 శాతం, డైస్, రసాయనాలపై 12 శాతం, జరీపై 13 శాతం, పని మీద 5 శాతం జీఎస్టీని చెల్లించాల్సి వస్తోంది. ఇంతటి భారాన్ని మోసే శక్తి చేనేత ఉత్పత్తిదారులకు లేదు. ఈ రంగంలో చాలా మంది నిరక్షరాస్యులే ఉన్నారు. వారందరికీ జీఎస్టీ ఖాతాలను తెరిచి ప్రభుత్వానికి చూపే స్థాయి లేదు. వెంటనే ఈ పన్నును చేనేత రంగంపై ఎత్తివేయాలి.



- మునగాల పూర్ణప్రసాద్, జనతా వీవర్స్, మంగళగిరి, స్టాల్ హోల్డర్

ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న రంగాన్ని ఆదరించండి...

మొన్నటి వరకు ఆత్మహత్యల వరకూ వెళ్లిన చేనేత రంగ కార్మికులు ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నారు. కులవృత్తిని వదులుకొని ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ ఎంతో మంది తిరిగి ఈ రంగంలోకి రావాలనుకుంటున్న తరుణంలో జీఎస్టీ పెద్దశాపంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమ్మై ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోకపోతే చేనేత రంగం తిరిగి సంక్షోభంలోకి పోతోంది.



- మమత, చందన ఇక్కత్, సరూర్‌నగర్ (స్టాల్ హోల్డర్)

పన్ను విషయమ్మై మంత్రి కేటీఆర్ కేంద్రానికి నివేదించారు..

చేనేత ఉత్పత్తిదారులపై జీఎస్టీ భారం మోపవద్దని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి కేటీఆర్ కేంద్రమంత్రిని కలిసి విన్నవించారు. దీనిపై జీఎస్టీ కౌన్సిల్‌లో చర్చ జరగనుంది. ఈ రంగంలో ఉత్పత్తిదారులకు అన్నీ పోనూ మిగిలేదే 5 శాతం ఆదాయం ఉంటుంది. దానిని జీఎస్టీగా చెల్లిస్తే వారు తీవ్రంగా నష్టపోతారు. ధర్మవరం, పోచంపల్లి, గద్వాల, ఉప్పాడ, సిద్ధిపేట, గొల్లభామ, వెంకటగిరి, తదితర కంపెనీలకు నష్టాలు వస్తాయి. ఆ భారాన్ని వారు వినియోగదారులపై వేస్తే ఈ ఉత్పత్తుల ధరలు మరింత పెరుగుతాయి. ఈ విషయమ్మై ఉత్పత్తిదారులకు ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందనే నమ్మకం ఉంది.



- కె.విద్యాసాగర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ


ప్రాజెక్టు నిండడంతో అలుగుపై నుంచి పొంగి పొర్లుతున్న నీరు (ఫైల్)


మట్టితో నిర్మించిన నల్లవాగు ప్రాజెక్టు ఎర్త్‌డ్యాం

ఎడమకాలువలో ప్రవహిస్తున్న నీరు


నీటితో పరవళ్లు తొక్కుతున్న కుడి కాలువ

నల్లవాగు ప్రాజెక్టు..

జీవనగంగ

- నల్లవాగు ప్రాజెక్టుకు నేటితో యాభై ఏళ్లు
- చెక్కుచెదరని మట్టి నిర్మాణం
- 14 గ్రామాలకు వరదాయిని
- 1967లో ప్రాజెక్టును ప్రారంభించిన అప్పటి సీఎం కాసుబ్రహ్మానందరెడ్డి
- పాలమూరు వాసుల చెమట శక్తితో నిర్మించిన డ్యాం

కల్హేర్ : పద్నాలుగు గ్రామాల రైతుల ఆశాదీపమైన నల్లవాగు ప్రాజెక్టుకు నేటితో 50 సంవత్సరాలు. వృథాగా నల్లవాగు ద్వారా లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్న స్థలంలో అడ్డుకట్ట పడిన రోజు. ఉమ్మడి కల్హేర్ మండలంలోని సుల్తానాబాద్ (నల్లవాగు) గ్రామాల వద్ద నల్లవాగు వాగుపై నిర్మించిన నల్లవాగు ప్రాజెక్టును 1967 ఆగస్టు 12న అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. 1964లో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 1967లో పనులు పూర్తయ్యాయి. 1969 సంవత్సరం వరకు పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీరు సరఫరా అయింది. కుడి, ఎడమ, అత్యవసర కాలువల కింద మొత్తం 5118 ఎకరాల ఆయకట్టు ఉంది. అప్పటి వరకు సాగునీటి అవకాశాలు లేక కేవలం వర్షాధార పంటలకే పరిమితమైన 14 గ్రామాల రైతుల భూములు పంటలతో కళకళలాడాయి. కర్నాటకలోని గుడుపల్లి గుట్టల్లో ప్రారంభమైన నల్లవాగు కంగ్టి, కల్హేర్ మండలాల మీదుగా కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన మంజీరా నదిలో కలుస్తుంది. లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతుండడంతో అప్పటి పాలకులు నల్లవాగు వాగుపై సుల్తానాబాద్ గ్రామం వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభానికి అప్పటి ఖేడ్ ఎమ్మెల్యే అప్పారావుషెట్కార్ కృషి చేయగా అనంతరం కాలువల నిర్మాణం, ఆయకట్టు నిర్ధారణ పనులకు మరో ఎమ్మెల్యే ఎం.వెంకట్‌రెడ్డి కృషి చేశారు.

కాంట్రాక్టర్, కూలీలు పాలమూరు వాసులే

ఈ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో 70 శాతానికి పైగా కూలీలు పాలమూరు (మహబూబ్‌నగర్) జిల్లా వాసులే కావడం విశేషం. ఆ రోజుల్లో వందలాది మంది కూలీలు ఇక్కడే నివాసం ఏర్పరుచుకుని నిర్మాణ పనుల్లో పాలు పంచుకున్నారు. పాలమూరు జిల్లాకే చెందిన హన్మంత్‌రెడ్డి అనే వ్యక్తి కాంట్రాక్టర్‌గా పనులు చేపట్టారు. ఈ పనులను తిరుపతిరెడ్డి మోతిమెన్ (అంటే అప్పుడు నీటి పారుదల శాఖలో ఈఈ స్థాయి అధికారి) గా వ్యవహరించగా, డీఈగా రాంక్రిష్ణారెడ్డి (మద్దతుదారు) పనులను పర్యవేక్షించారు. వీరి కింద ఏఈలు, వర్క్ ఇన్స్ స్పెక్టర్‌లు చాలా మంది వరకు పనులు చేపట్టారు.

నేటికీ చెక్కు చెదరని ఎర్త్ డ్యాం

కేవలం మట్టి (మొరం) తో నిర్మించిన ఎర్త్‌డ్యాం ఇది. 0.6 టీఎంసీ నీటి నిలువ కలిగి ఉండే ఈ ప్రాజెక్టును దశల వారీగా నిర్మించారు. స్లాబులుగా ఎర్ర మట్టి, నల్లమట్టి వేసుకుంటూ నిర్మాణం చేపట్టారు. ఇంతటి నీటి నిల్వ సామర్థ్యంతో మట్టి కట్ట కలిగి ఉన్న నల్లవాగు ప్రాజెక్టు లాంటివి చాలా అరుదుగా ఉంటాయి. ప్రాజెక్టు కట్ట పొడవు 1.60 కిలో మీటర్లు (65 చైనెజీల) ఉండగా ఈ కట్టకు అవసరమైన మట్టిని సమీపంలోని గట్టు నుంచి తవ్వి తీశారు. నల్ల మట్టిని కలుపుతూ ప్రాజెక్టు కట్టను నిర్మించడంతో ఎంత పెద్ద వరద తాకిడినైనా తట్టుకోగలుగుతుంది. 1984 సంవత్సరంలో కట్టపై నుంచి మోస్తరుగా నీరు పొంగినా ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు.

ప్రాజెక్టు గణాంకాలు

ప్రాజెక్టు నీటి మట్టం సముద్ర మట్టానికి 1493 అడుగులు కాగా గరిష్ట నీటి మట్టం 1497.50 అడుగులు. కనిష్ట నీటి మట్టం (డెడ్ స్టోరేజ్) 1478 అడుగులు. అత్యవసర సిల్ట్ స్టోరేజ్ 1475 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా 111 స్కేవర్ మైళ్లు ప్రాజెక్టు అడుగు భాగం నుంచి ఎత్తు 60 ఫీట్లు కలిగి ఉంది. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 652.94 ఎంసీఎఫ్‌టీలు (0.6 టీఎంసీ) కాగా కట్ట పొడవు 1.60 కిలో మీటర్లుగా ఉంది. ప్రాజెక్టు అలుగు పొడవు 1500 మీటర్లు. ప్రాజెక్టు కుడి కాలువ పొడవు 22.50 కిలో మీటర్లు కాగా దీని ద్వారా 114.50 క్యూసెక్కుల నీటి విడుదల సాగుతోంది. 4109 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తుంది. ఎడమ కాలువ 11.125 కిలో మీటర్ల పొడవునా ప్రవహిస్తూ 0.905 క్యూసెక్కుల నీటితో 230 ఎకరాల తరి, 719 ఎకరాల ఆరుతడి పంటలకు సాగునీరందిస్తుంది. అత్యవసర కాలువ ద్వారా 60 ఎకరాలకు నీరందుతుంది.

ఆయకట్టు గ్రామాలు

నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ కింద సుల్తానాబాద్, గోసాయిపల్లి, పోచాపూర్, బీబీపేట, ఫత్తేపూర్, మార్డి, ఖానాపూర్(కె), క్రిష్ణాపూర్, ఇందిరానగర్, కల్హేర్‌గ్రామాలకు చెందిన 4109 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఎడమ కాలువ కింద బొక్కస్‌గామ్, అంతర్గాం, కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని మార్‌దండె, తిమ్మానగర్ గ్రామాల ఆయకట్టు ఉంది. అలాగే బొక్కస్‌గామ్, అంతర్గాం గ్రామాలకు చెందిన 230 ఎకరాలకు తరి పంటకు నీరివ్వాల్సి ఉంది. అలాగే కామారెడ్డి జిల్లా మార్‌దండా, తిమ్మానగర్ గ్రామాల్లోని 718 ఎకరాల ఆయకట్టుకు ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు ఆదేశాల మేరకు సాగునీరు విడుదల చేస్తారు. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో మొత్తం 4844 మంది రైతులు ఉన్నారు.

మధ్యలో చేరిన 718 ఎకరాల ఆయకట్టు

కామారెడ్డి జిల్లాలోని మార్‌దండ, తిమ్మానగర్ గ్రామాలకు చెందిన 718 ఎకరాల ఆయకట్టును ఐడీక్రాప్స్ కింద 1984 సంవత్సరంలో చేర్చినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. పాత నిజామబాద్ జిల్లాలోని ఈ రెండు గ్రామాల ఆయకట్టుకు 20 సంవత్సరాల పాటు మాత్రమే వేసవిలో పంటలకు సాగునీరు అందించాలనే నిబంధన మేరకు నల్లవాగు ప్రాజెక్టు ఎడమ కాలువ కింద చేర్చుతూ పోచారం ప్రాజెక్టు అతిథి గృహంలో పెద్దల సమక్షంలో ఒప్పందమైనా నేటికి సాగునీటి సరఫరా ఆ రెండు గ్రామాలకు కొనసాగుతూనే ఉంది.

నాలుగు గ్రామాలకు 20 సంవత్సరాలే ఆనందం

నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు కింద 14 గ్రామాలు ఉన్నప్పటికీ ఇందులో కుడికాలువ కింద క్రిష్ణాపూర్, ఇందిరానగర్, మార్డి, కల్హేర్ గ్రామాల రైతులకు గతంలో 20 ఏళ్ల పాటు మాత్రమే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు సరఫరా సాగింది. తర్వాత సాగునీరు అందలేదు. దీనికి కాలువ దుస్థితి, ప్రాజెక్టులో పేరుకు పోయిన పూడిక, నీటి పర్యవేక్షణ లోపమే కారణం. 2005లో ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలను రూ.14 కోట్లతో ఆధునికీకరించినా చివరి ఆయకట్టు భూములకు సాగునీరు సరఫరా చేసే సౌకర్యాన్ని నీటి పారుదల శాఖ విస్మరించింది.

ప్రాజెక్టు పనుల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది



నల్లవాగు ప్రాజెక్టు పనుల్లో నేను పని చేయడం ఆనందంగా ఉంది. ప్రాజెక్ట్ నేటితో 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సంతోషకరం. అప్పట్లో ఒక్క రోజు కూలి రూ.10 ప్రకారం మేస్త్రీ పని చేశాను. నా కింద పని చేసే కూలీలకు అప్పట్లో 2 లేదా 3 పైసలు చెల్లించే వారు.

- ఉప్పరి లక్ష్మయ్య సాగర్, మంగల్‌పేట్

హోటల్‌తో ఉపాధి పొందాను



నల్లవాగు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నేను సుల్తానాబాద్‌లో హోటల్ నిర్వహించి కూలీలకు టీ, ఇతర ఫలహారాలు అందించి ఉపాధి పొందాను. అప్పుడు నాకు 16 సంవత్సరాలు. మా తల్లిదండ్రులతో పాటు మరో తొమ్మిది మంది పని వారు హోటల్‌లో పని చేసేవారు. కూలీలతో పాటు ఉన్నతాధికారులు హోటల్‌లో టీ తాగి మెచ్చుకునే వారు.

- మల్లయ్య స్వామి, సుల్తానాబాద్

నల్లవాగు ద్వారా ఆనందంగా ఉన్నాం



నల్లవాగు ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసుకున్న అనంతరం నుంచి మేము భూములకు కుడి, అత్యవసర కాలువల ద్వారా సాగునీరును ఉపయోగిస్తూ వరి పండించుకుంటున్నాం. మా పాలిట ప్రాజెక్టు వరదాయినిగా మారింది. రైతులమంతా ఎంతో ఆనందంగా ఉన్నాం.

- బొగుడాల సత్యం, రైతు సుల్తానాబాద్

చివరి ఆయకట్టుకు నీరందించాలి



నీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు కాలువలు, డిస్ట్రీబ్యూటరీలు ఆధుని కీకరించి చివరి ఆయకట్టుకు నీరు అందించాలి. పేరుకే నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు భూములుగా చలామణి అవుతున్నా బోరు బావులు తవ్వి వ్యవసాయం చేస్తున్నాం. లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు అలుగుపై పొంగి ప్రవహిస్తున్నా ఆయకట్టు చివరి భూములకు మాత్రం చుక్కనీరు రావడం లేదు.

- బొగ్గుల సంగయ్య, రైతు, మారి

ఆయకట్టు రైతులకు శుభాకాంక్షలు

నల్లవాగు ప్రాజెక్టు నిర్మించి నేటికి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆయకట్టు రైతులకు శుభాకాంక్షలు. నేను ప్రాజెక్ట్‌కు గతంలో ఏఈగా పని చేశాను. తర్వాత పదోన్నతులు పొందాను. కుడి, ఎడమ అత్యవసర కాలువల ద్వారా నల్లవాగు ప్రాజెక్టు నీటితో వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రాజెక్టు ఎంతోగాను ఉపయోగపడుతుంది. అయితే చివరి ఆయకట్టుకు సక్రమంగా నీరందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వారి అవస్థలు త్వరలోనే ఈ ప్రభుత్వహయాంలోనే తొలిగి పోతాయని ఆశిస్తున్నా.

- రాములు, ఈఈ, నీటి పారుదల శాఖ సంగారెడ్డి జిల్లా

1976 మే 25 ఏ వారం అవుతుంది?

మెంటల్ ఎబిలిటి




Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

1. 200 కిమీ పొడవైన రహదారిపై రెండు కార్లు చెరోవైపు నుంచి ప్రయాణిస్తున్నాయి. మొదటి కారు 40 కిమీ ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 20 కిమీ ప్రయాణించింది. మరల ఎడమవైపునకు తిరిగి 35 కిమీ ప్రయాణించింది. తదుపరి ఎడమవైపునకు తిరిగి మెయిన్ రోడ్డుకు చేరుకొంది. రెండో కారు చిన్న లోపంతో కేవలం 55 కిమీ మాత్రమే ప్రయాణించింది. అయితే ప్రస్తుతం ఆ రెండు కార్ల మధ్య దూరం ఎంత?
   ఎ) 60 కిమీ బి) 80 కిమీ సి) 75 కిమీ డి) 70 కిమీ
2. 6842109357 సంఖ్యలో మొదటి అంకెను రెండో స్థానంలోకి, రెండో అంకెను మొదటి స్థానంలోకి, మూడో అంకెను నాలుగో స్థానంలోకి, నాలుగో అంకెను మూడో స్థానంలోకి ఇలా అన్ని అంకెలు మారగా ఏర్పడిన కొత్త సంఖ్యలో ఎడమ నుంచి అయిదో అంకెకు గల మూడో కుడి అంకె?
   ఎ) 9 బి) 5 సి) 3 డి) 4
3. కింది సంఖ్యలను ముందుగా వ్యతిరేక దిశలో రాసి తరవాత ఆ సంఖ్యలను అవరోహణ క్రమంలో రాస్తే మధ్య సంఖ్య మధ్య అంకె?
   853, 942, 687, 439, 924, 168, 316
   ఎ) 8 బి) 2 సి) 1 డి) 4
4. 80 మంది విద్యార్థులు ఉన్న ఒక వరసలో కిరణ్ ఎడమ నుంచి 32వ స్థానంలోను, తరుణ్ కుడి నుంచి 28వ స్థానంలోను ఉన్నారు. అయితే ప్రస్తుతం వారిద్దరి మధ్య గల విద్యార్థుల సంఖ్య?
   ఎ) 20 బి) 40 సి) 28 డి) 26
5. ఒక వరసలో అచ్యుత్ ఎడమ నుంచి పదో స్థానంలోను, కుడి నుంచి ఆరోస్థానంలోను ఉన్నాడు. ఆ వరసలో మొత్తం సభ్యుల సంఖ్య 34 ఉండాలంటే ఎంతమంది వ్యక్తులు అవసరం?
   ఎ) 12 బి) 19 సి) 21 డి) 18
6. వివేక్‌కు అతని సోదరి పుట్టిన రోజు ఆగస్టు 20, 25 మధ్య అని గుర్తు. అతని తండ్రికి తమ కుమార్తె పుట్టిన రోజు సెప్టెంబరు 23, 28 మధ్య అని గుర్తు అయితే వివేక్ సోదరి పుట్టిన రోజు ఎప్పుడు?
   ఎ) ఆగస్టు 24 బి) సెప్టెంబరు 24
   సి) చెప్పలేం డి) ఏదీకాదు
7. పాట్నాకు ఒక రైలు ప్రతి 80 నిలకు ఉంది. విచారణాధికారి తనను కలసిన ప్రయాణి కుడితో రైలు వెళ్లిపోయి 15నిలు అయింది. తరవాతి రైలు గం.10.15నిలకు అని చెప్పాడు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పాడు?
   ఎ) గం. 9.10 ని. బి) గం. 10.20 ని.
   సి) గం. 9.30 ని. డి) ఏదీకాదు
8. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల సరి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
   8 4 3 9 8 6 5 9 2 3 6 8 4 2 7 9 2 8 3 9
   ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) ఏమీ లేవు
9. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి

8	5	961
7	8	522
9	3	?

   ఎ) 843 బి) 441 సి) 924 డి) 462
10. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి



   ఎ) 65 బి) 92 సి) 48 డి) 64
11. ఒక అంకె 3 కన్నా పెద్దది 7 కన్నా చిన్నది. అదే అంకె 5 కన్నా పెద్దది, 9 కన్నా చిన్నది. అయితే ఆ అంకె?
   ఎ) 8 బి) 4 సి) 6 డి) 9
12. 1976 మే 25 ఏ వారం అవుతుంది?
   ఎ) గురువారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) సోమవారం
13. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల బేసి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
   8 4 3 9 2 5 6 8 5 2 7 3 4 6 8 7 9 2 1 4 8 9 3
   ఎ) నాలుగు బి) మూడు సి) రెండు డి) ఏమీలేవు
14. ఇంటర్వ్యూ నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 11.00 కంటే 15 ని.లు ముందుగా వచ్చారు. ఈయన చైర్మన్ కంటే 25ని.లు ముందు వచ్చారు. చైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 20 నిలు ముందు వచ్చారు. అయితే ఇంటర్వ్యూని ఎప్పుడు నిర్వహించాలనుకొన్నారు?
   ఎ) గం. 11.00 ని. బి) గం. 11.30 ని.
   సి) గం. 11.15 ని. డి) ఏదీకాదు
15. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్యలో వచ్చే పదాన్ని తెలపండి?
   1. Mobile 2. Master 3. Manner
   4. Market 5. Minister
   ఎ) Master బి) Minister
   సి) Market డి) Mobile
16. అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం కుడి నుంచి 12 వ అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరం?
   ఎ) P బి) R సి) Q డి) J
17. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను సవ్య దిశలో రాసి రెండో సగం అక్షరాలను అపసవ్య దిశలో రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల అయిదో కుడి అక్షరం?
   ఎ) Z బి) Y సి) X డి) W
18. సవ్యదిశ వర్ణమాలలో కుడి ఆరో అక్షరం నుంచి పది అక్షరాలను అపసవ్యదిశలో రాసి మిగిలిన అక్షరాలను యధాతథంగా రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల నాలుగో కుడి అక్షరం?
   ఎ) U బి) R సి) T డి) S
19. 1956 ఆగస్టు 2న ఏవారమవుతుంది?
   ఎ) శుక్రవారం బి) శనివారం
   సి) గురువారం డి) బుధవారం
20. ఈ రోజు ఆగస్టు 19 గురువారం. ఇది లీపు సంవత్సరమయితే మూడేళ్ల క్రితం ఇదే తేదీకి ఏ వారం వస్తుంది?
   ఎ) ఆదివారం బి) శనివారం
   సి) సోమవారం డి) బుధవారం
21. 2001 జనవరి 1 శుక్రవారం అయితే తదుపరి వచ్చే ఏ సంవత్సరంలో జనవరి 1 శుక్రవారమవుతుంది?
   ఎ) 2001 బి) 2007 సి) 2008 డి) ఏదీకాదు
22. ఈ రోజు నవంబరు 14 గురువారం. ఇది లీపు సంవత్సరం. అయితే అయిదేళ్ల తరవాత ఇదే తేదీకి ఏ వారమొస్తుంది?
   ఎ) బుధవారం బి) మంగళవారం
   సి) గురువారం డి) ఏదీకాదు
23. గడియారంలో సమయం గం.1.30ని. అయితే నిముషాల ముల్లు, గంటల ముల్లు మధ్య కోణం?
   ఎ) 180° బి) 120° సి) 135° డి) 140°
24. విక్రం 50 మీ ఉత్తరానికి నడచిన తరవాత కుడివైపునకు తిరిగి 40 మీ నడిచాడు. మరల కుడివైపునకు తిరిగి 35 మీ నడచిన తరవాత కుడివైపునకు తిరిగి 25 మీ నడిచాడు. చివరగా ఎడమవైపునకు తిరిగి 15 మీ నడిచాడు. అయితే ప్రస్తుతం విక్రం బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
   ఎ) 15 మీ తూర్పు బి) 15 మీ పడమర
   సి) 15 మీ ఉత్తరం డి) 15మీ దక్షిణం
25. గడియారంలో సమయం గం.12.00 అయింది. గంటల ముల్లు తూర్పును చూపిస్తోందనుకొంటే గం3.30నిల సమయంలో నిముషాల ముల్లు ఏ దిక్కును సూచిస్తోంది?
